Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

గురువారం, ఏప్రిల్ 23, 2026 | సంపుటి - 20 | సంచిక 218 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## కాల్పుల విరమణ
# పొడిగించిన ట్రంప్



- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు

వాషింగ్టన్ : ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసు కున్నారు. ఇరుదేశాల మధ్య గతం లో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు.

తరువాయి 2లో



2

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కెసిఆర్, హరీష్‌లకు
# ఊరట

### జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేసిన హైకోర్టు

హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది.

# ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

### హైకోర్టు తీర్పుపై మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్ : ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయి స్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపిత మైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి 2లో

# సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు



### వెంటనే సమ్మె విరమించి రండి
### ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

హైదరాబాద్ : ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు.

తరువాయి 2లో



## డిమాండ్లు పరిష్కరించకుంటే
# సమ్మె ఉధృతం

**ఆర్టీసీ డిపోల ఎదుట నేడు మహాధర్నాకు పిలుపు**
**సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదన్న జెఎసి**

### ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్
### డిపోలకే పరిమితం అయిన బస్సులు

- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను ఫ్రగీ తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి

## కాళేశ్వరం కథ
# ముగియలేదు

### సిబిఐ విచారణకు తీర్పు అడ్డంకి కాదు
### బిఆర్ఎస్ నేతల సంబరాలు ఎందుకో
### మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్ : కాళేశ్వరంపై తెలంగాణ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటు న్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదన్నారు. హైకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసు కుంటామని వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పలువురికి నోటీసులు ఇవ్వలేదని మాత్రమే హైకోర్టు చెప్పిందని వివరించారు.

తరువాయి 2లో



2

# కాళేశ్వరం అవినీతి జగమెరిగిన సత్యం

### అన్ని నివేదికలు ఇదే చెప్పాయి
### హైకోర్టు తీర్పుపై కోదండరామ్ వ్యాఖ్య

హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి తెలం గాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై టీజేఏసీ అధ్యక్షులు కోదండరాం స్పందించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసు కుంటున్నారో అర్థం కావడం లేదన్నారు.

## కాళేశ్వరంపై ఎవ్వరికీ
# క్లీన్ చిట్ ఇవ్వలేదు



### హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు
### తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు
### సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో తరువాయి 2లో

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు



**కాళేశ్వరం అవినీతి విచారణలో సర్కార్ విఫలం**
**అవకతవకలపై ఇన్నేళ్లయినా చర్యలు లేవు**
**ప్రభుత్వ వైఫల్యాన్న బయటపెట్టిన హైకోర్టు తీర్పు**
**విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్ : కాళేశ్వరం అవినీతి విచారణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తరువాయి 2లో



## రూ.5,400 కోట్ల పెట్టుబడులతో
# రెన్యూ ఎనర్జీ గ్లోబల్

### రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్
### అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్
### నేడు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ లోని రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జ్ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది.

తరువాయి 2లో

## ఇడి విచారణలో
# జోక్యం చేసుకోవడమేంటి?
### మమతా బెనర్జీ తీరుపై సుప్రీం ఆగ్రహం



3

## పిఠాపురం ఘటనపై
# సిఎం చంద్రబాబు సీరియస్



**మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై అసహనం**
**వర్మతో మాట్లాడాలని పల్లాకు బాబు ఆదేశం**

అమరావతి : పిఠాపురంలో జరిగిన ప్రొటోకాల్ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, పార్టీ నేతలు ఐక్యంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సీఎం మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ నేతలు ప్రొటోకాల్ పేరుతో, ఫ్లెక్సీల్లో ఫొటోల ప్రాధాన్యం కోసం ఘర్షణ పడటం సరికాదని సీఎం వ్యాఖ్యా నించారు. పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ పాడా సమావేశం సందర్భంగా జరిగిన ఈ వివాదంలో 3లో

# అన్ని మతాచారాలను ఒకే గాటన కట్టలేం

## వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యం కూడా ముఖ్యం

## శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం కేసు విచారణ

## సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ఏప్రిల్ 22 : మత స్వేచ్ఛ, సామాజిక సంస్కరణల మధ్య సమతుల్యత అనేది ఆయా కేసుల వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యంపైనే ఆధారపడి ఉంటుందని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విచారణ కేవలం శబరిమలకే పరిమితం కాకుండా, మసీదుల్లోకి మహిళల ప్రవేశం, పార్శీ మహిళల హక్కుల వంటి ఇతర మతపరమైన అంశాలను కూడా స్పృశిస్తోంది. ఒక మతానికి చెందిన ఆచారం లేదా నిబంధనను ప్రాతిపదికగా తీసుకుని, అదే సూత్రాన్ని అన్ని మతాల ఆచారాలకు వర్తింపజేయడం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం, మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వ జోక్యంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు.. మత స్వేచ్ఛ, రాజ్యాంగ పరమైన హక్కుల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయి. మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వం ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చనే అంశంపై ముందస్తుగా ఎలాంటి ఉమ్మడి లేదా సార్వత్రిక నిబంధనలను విధించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు ఉన్న మత స్వేచ్ఛను గౌరవిస్తూనే, అవసరమైన చోట సామాజిక సంస్కరణల కోసం ప్రభుత్వం జోక్యం ఏ మేరకు ఉండాలనేది న్యాయస్థానం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వ జోక్యంపై ముందస్తుగా గైడ్‌లైన్స్ జారీ చేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే వివిధ కేసుల విచారణకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని ధర్మాసనం భావించింది. మతపరమైన హక్కులు 'రాజ్యాంగ నైతికత'కు లోబడి ఉండాలా లేదా అనే కీలక ప్రశ్నపై ఈ విచారణ కొనసాగుతోంది. ఏడో రోజు విచారణ ద్వారా సుప్రీంకోర్టు మతపరమైన విషయాల్లో న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పరిధులను అత్యంత జాగ్రత్తగా విశ్లేషిస్తోంది. శబరిమల తీర్పును పున:సమీక్షించే క్రమంలో వెలువడే ఈ నిర్ణయాలు భారతదేశంలోని అన్ని మతాల ఆచార వ్యవహారాలపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది. తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం తీసుకునే నిర్ణయం మతపరమైన హక్కుల విషయంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది.

# పిఠాపురం ఘటనపై సిఎం చంద్రబాబు సీరియస్

మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహరించిన తీరు సరికాదని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సంఘటనలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు టీడీపీ నేతలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ పెద్దలకు లేదా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా గొడవలు పడటం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇలాంటి ఘటనలు కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హుకుం జారీ చేశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే వర్మకు తగిన సూచనలు ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. పార్టీ అంతర్గత క్రమశిక్షణను కాపాడాలని, నేతలు వ్యక్తిగత ప్రాధాన్యం కోసం పోటీ పడకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీలో ఐక్యత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని.. వ్యక్తిగత ఘర్షణలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని సీఎం హెచ్చరించారు.

# ఇడి విచారణలో జోక్యం చేసుకోవడమేంటి?

న్యూఢిల్లీ : పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మనీలాండరింగ్ వ్యవహారంలో రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ 'ఐప్యాక్'పై జరుగుతున్న ఈడీ విచారణలో ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు నేరుగా కలగజేసుకోవడం సరికాదని, ఆమె చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేలా ఉన్నాయని వ్యాఖ్యానించింది. బెంగాల్‌లో చోటుచేసుకున్న బొగ్గు కుంభకోణానికి సంబంధించిన నమోదైన మనీలాండరింగ్ కేసుపై ఈడీ గత కొన్నాళ్లుగా దర్యాప్తు చేస్తోంది. అయితే, ముఖ్యమంత్రి మమతాబెనర్జీతోపాటు ప్రభుత్వ అధికారులు దర్యాప్తులో జోక్యం చేసుకుంటున్నారంటూ ఈడీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా ప్రవర్తించే పరిస్థితి తలెత్తుతుందని రాజ్యాంగనిర్మాత అంబేద్కర్ ఎప్పుడూ ఊహించి ఉండరని వ్యాఖ్యానించింది. ఇది రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య వివాదం కాదు. ఓ ముఖ్యమంత్రి నేరుగా విచారణలో జోక్యం చేసుకోవడం సమర్థనీయం కాదు. ఈ అంశాన్ని కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వివాదంగా తయారు చేయొద్దు. మీ చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని మమతాబెనర్జీని ఉద్దేశించి సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ప్రతీక్‌జైన్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తన అధికారులతో కలిసి అక్కడకు ప్రవేశించినట్లు కోర్టుకు వెల్లడించారు. 2021 నుంచి టీఎంసీ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోన్న సంగతి తెలిసిందే.

# ఆరుగురు ఐపిఎస్‌లకు డిజి హోదా

హైదరాబాద్,ఏప్రిల్ 22 : తెలంగాణలో పనిచేస్తున్న ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డీజీ హోదా కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ఒక ప్రకటనను విడుదల చేశారు. 1995 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు,1996 బ్యాచ్‌కు చెందిన చారుసిన్హా, అనిల్‌కుమార్, సజ్జనార్ కు డైరెక్టర్ జనరల్ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

## పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక

## రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయండి

## హైకోర్టు తీర్పుపై మీడియాతో కెటిఆర్



హైదరాబాద్,ఏప్రిల్ 22 : కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఇవాళ గెలిచింది.. తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసింది. ఇవాళ తెలంగాణలో పారుతున్న ప్రతినీటి బొట్టు కేసీఆర్ కృషే. భూమిపై గోదావరి పారినన్ని రోజులూ కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరిపివేయలేరు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, పీసీసీ నివేదిక అని నేను అప్పుడే చెప్పాను. హైకోర్టు తీర్పుతో అందరికీ ఇవాళ జ్ఞానోదయం కలిగి ఉంటుంది. కాళేశ్వరం కచ్చితంగా తెలంగాణకు వరప్రదాయని. రూ.94వేల కోట్లు ఖర్చు అయితే.. రూ.లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదు.. మూడు బ్యారేజీలు. మేడిగడ్డపై చేసిన ఖర్చు రూ.3,800 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ కుట్రల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మరోసారి చెబుతున్నా. రాష్ట్రంలో చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేలుస్తున్నారు. ఈ విషయంలో కేంద్రం ఏం చేస్తోంది? మేడిగడ్డలో ఏం జరిగిందో విశ్రాంత జడ్జితో మళ్లీ విచారణ జరిపించాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టు తీర్పు ఒక గట్టి 'చెంపపెట్టు' అని కేటీఆర్ అభివర్ణించారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని కేటీఆర్ పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ కుట్రలకు బ్రేక్ పడినట్లయిందని కేటీఆర్ స్పష్టం చేశారు. కమిషన్ విచారణలో సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా విస్మరించడమే కాకుండా, నిబంధనలకు పాతరేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే స్పష్టం చేశారని, ఆ విషయాలతో ఇవాళ హైకోర్టు కూడా ఏకీభవించడం హర్షణీయమని ఆయన తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే మేడిగడ్డ బ్యారేజీలో స్వల్పంగా దెబ్బతిన్న రెండు పిల్లర్లను రిపేర్ చేసి, రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని సూచించారు. రాజకీయ క్రీడ కంటే రైతుల ప్రయోజనాలే ముఖ్యమని కేటీఆర్ హితవు పలికారు.గోదావరి జలాలను పక్కరాష్ట్రానికి దోచిపెట్టి, తెలంగాణలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుతంత్రాలను ఇంకా కొనసాగించాలని చూస్తే రేవంత్ సర్కారుకు రైతుల చేతిలోవాతలు తప్పవని కేటీఆర్ హెచ్చరించారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# యాజమాన్య నిర్లక్ష్యానికి పరాకాష్ట

## పన్నూర్ బొక్కల వాగు రోడ్డు వద్ద ప్రమాదం

## సీఐటీయూ ఆర్.జీ-త్రీ కార్యదర్శి దొమ్మటి. కొమురయ్య



రామగిరి, ఏప్రిల్ 22(ది క్రైమ్ న్యూస్) : - ఆర్.జీ-త్రీ ఏరియా ఏ.ఎల్.పి లో యువ కార్మికుడు కే .సందీప్ పొద్దున 05:40 ఖఏ డ్యూటీకి వెళుతున్న సమయంలో పన్నూర్ బొక్కల వాగు వద్ద ప్రమాదానికి గురికావడం చాలా బాధాకరమని యాజమాన్య నిర్లక్ష్యానికి పరాకాష్ట సీఐటీయూ ఆర్.జీ-త్రీ కార్యదర్శి దొమ్మటి. కొమురయ్య అన్నారు.ఈ సందర్బంగా సీఐటీయూ ఆధ్వర్యంలో చాలాసార్లు యాజమాన్యానికి వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని డ్యూటీ సమయాలు లారీలు బందు పెట్టాలని లారీలు నిర్లక్ష్యంగా నడుపుతున్నారని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పామని చాలా ఘటనలు జరిగినాయని అన్నారు. సందీప్ కు మెరుగైన వైద్యం అందించాలని, వెంటనే ఇప్పటికైనా డ్యూటీ సమయాలలో లారీలు బందు పెట్టాలని, కార్మికులను ప్రమాదాల బారినుండి రక్షించాలని సీఐటీయూ ఆర్.జీ-త్రీ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య డిమాండు చేయడం జరిగింది.

# బేగంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రామగిరి, ఏప్రిల్ 22(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం బేగంపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు బుధవారం ప్రారంభించారు.రైతంగానికి మేలు చేయడమే ప్రభుత్వ సంకల్పమని రైతును రాజు చేయడమే లక్ష్యంగా ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పని చేస్తున్నారని బేగంపేట గ్రామంలో రైతులకు ధాన్యం ఆరబెట్టడం కొరకు విస్తృత స్థాయిలో భూమిని చదును చేసి బేగంపేట రైతంగాని అప్పగించారని మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు తెలిపారు. ఎలాంటి షరతులు లేకుండా చివరి గింజ వరకు ధాన్యాన్ని కొంటామని చైర్మన్ వైనాల రాజు పేర్కొన్నారు.

# పర్యాటక రంగంలో 'రివర్స్ టూరిజం'

## 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్

## జెండా ఊపి ప్రారంభించిన మంత్రి జూపల్లి

## ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి

నిర్మల్,ఏప్రిల్ 22 : రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ఒరవడికి నాంది పడింది. కేవలం నగరవాసులు ప్రకృతిని చూడటానికి పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని కళ్లారా చూడాలన్న సంకల్పంతో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడెంలో బుధవారం నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఆదివాసీలకు కొత్త అనుభవాలు ఇవ్వడం, నగర జీవన విధానం పరిచయం చేయడం, ఆత్మవిశ్వాసం పెంచడం, రెండు సంస్కృతుల మధ్య అవగాహన పెంచడం, సాంస్కృతిక మార్పిడి, అంతిమంగా ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వివరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా, మంత్రి జూపల్లి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రయాణ పొడవునా వారితో ముచ్చటిస్తూ పర్యటన లక్ష్యాన్ని వివరించారు. 'బయటి ప్రపంచంతో అనుసంధానం కావడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నగరాల్లోని అభివృద్ధిని చూసి చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవాలి. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలి. అప్పుడే ఆదివాసీల జీవన ప్రమాణాల్లో మార్పులు వస్తాయి' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివాసీల విశిష్ట సంస్కృతికి, నగర నాగరికతకు మధ్య ఈ కార్యక్రమం ఒక వారధిలా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. 5 ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన 250 మంది ఆదివాసీలు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తారామతి బారాదరికి చేరుకుంటారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కామ్డే పాల్గొన్నారు. వీరితో పాటు డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సక్కు, సోయం బాపురావు, ఆడే గజేందర్ తదితరులు పాల్గొన్నారు,

# హామీలను నెరవేరుస్తూ..అభివృద్ధి

అనంతపురం,ఏప్రిల్22 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ 22 నెలల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. గొందిరెడ్డిపల్లి నుంచి పుల్లలరేవు వరకూ రూ.1.30 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, పుల్లలరేవులో రూ.50 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గంలో చేపట్టిన అన్నిపనులను పూర్తి చేస్తున్నామని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తూ 22 నెలల్లోనే రాప్తాడు మండలంలో రూ.26 కోట్లతో రోడ్లు వేశామన్నారు. గొందిరెడ్డిపల్లి నుంచి పుల్లలరేవు వరకూ తారు రోడ్డు నిర్మించామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామన్నారు.

# ప్రభుత్వ కాలేజీలు, హాస్పిటళ్ల అభివృద్ధి

## అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయండి

## అధికారులకు మంత్రి దామోదర ఆదేశాలు

హైదరాబాద్,ఏప్రిల్ 22 : రాష్ట్రంలో ప్రభుత్వ కాలేజీలు, హాస్పిటళ్ల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. భారత సంప్రదాయ వైద్య సేవలకు ప్రాచుర్యం కల్పించి, ప్రజలకు ఉపయోగపడేలా ఆయుష్ డిపార్ట్‌మెంట్ పనివిధానం ఉండాలని మంత్రి సూచించారు. ఓపీ, ఐపీ పేషెంట్ల సంఖ్య మరింత పెరగాలన్నారు. అవసరమైన చోట డాక్టర్లు, సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. సిద్ధిపేట, వికారాబాద్, భూపాలపల్లిలోని ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించి, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.ఆయుష్ మెడిసిన్ సప్లైలో గ్యాప్ ఉండకూడదని, పేషెంట్లకు అవసరమయ్యే అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.ప్రభుత్వ ఆయుర్వేద, హోమియోపతి డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్‌ను స్ట్రిక్ట్‌గా మానిటర్ చేయాలని మంత్రి ఆదేశించారు. డ్యూటీలకు గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సరియైన అనుమతులు, అర్హతలు లేకుండా, ఆయుర్వేద, హోమియోపతి తదితర హాస్పిటళ్లు, క్లినిక్‌లు నడిపిస్తూ, తప్పుడు ప్రకటనలతో ప్రజలను దోచుకుంటున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబును మంత్రి ఆదేశించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఆయుర్వేద, హోమియోపతి తదితర పేర్లతో నడుస్తున్న క్లినిక్‌లు, హాస్పిటళ్లను తనిఖీ చేయాలని, అవసరమైన అనుమతులు లేని హాస్పిటళ్లపై చర్యలు ప్రారంభించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలపై నేచర్‌క్యూర్ హాస్పిటల్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సమీక్ష చేశారు.ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు తదితరులు పాల్గొన్నారు.రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆయుష్ హాస్పిటల్స్, క్లినిక్‌లు, కాలేజీలు, తదితర అంశాలను మంత్రి ఆరా తీశారు.

# గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రభుత్వం అండ

## మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

## మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్,ఏప్రిల్ 22 : విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గిగ్ వర్కర్ల కుటుంబ సభ్యులకు కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. గిగ్ వర్కర్లు లోకుర్తి నరేష్, జీ. శ్యామ్ సుందర్ మరియు అహ్మద్ బిన్ అబ్దుల్ ఖాదర్ కుటుంబ సభ్యులకు మంత్రి స్వయంగా చెక్కులు అందజేశారు. సెక్రటేరియట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్లకు అండగా నిలుస్తూ అసెంబ్లీలో గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ చట్టాన్ని ఆమోదించిందని తెలిపారు. గిగ్ వర్కర్లకు ఇలాంటి రక్షణ, భద్రతా వలయం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఏ కార్మికుడికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. గిగ్ వర్కర్లు అయినా, హమాలీలు అయినా అందరికీ ప్రభుత్వం నుండి తగిన సహాయం, పరిరక్షణ అందాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గిగ్ వర్కర్ల యూనియన్ కీలక పాత్ర పోషించిందని, వారు కార్మిక శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ చర్యలను సాధ్యంచేసారని మంత్రి అభినందించారు. ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ గిగ్ వర్కర్లు మరియు బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేయదని, వారి హక్కులు మరియు సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ ఈ. గంగాధర్, గిగ్ వర్కర్ల యూనియన్ నాయకుడు సలావుద్దీన్ మరియు ఇతరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందించడంతో పాటు తమకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

# హజ్ యాత్రకు పదివేల మంది సిద్ధం

## సకాలంలో వారిని హజ్‌కు పంపాలి

## అధికారులతో సమీక్షలో మంత్రి అజారుద్దీన్

హైదరాబాద్,ఏప్రిల్ 22 : తెలంగాణ మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ హజ్-2026 ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నుండి ప్రయాణించే సుమారు 10,000 మంది యాత్రికులకు ఉత్తమ సౌకర్యాలు కల్పించాలని అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. రవాణా, భద్రత, వైద్య సేవలు, విమానాశ్రయ సమన్వయం, యాత్రికుల సంక్షేమ చర్యలు సమర్థవంతంగా అమలు అవుతున్నాయి. తెలంగాణ సచివాలయంలో హజ్-2026 ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష చేశారు. ఎంబార్కేషన్ పాయింట్ నుండి ఈ సంవత్సరం హజ్ యాత్రకు బయలుదేరనున్న సుమారు 10,000 మంది యాత్రికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు ప్రపంచ స్థాయి ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖలకు ఆదేశించారు. యాత్రికుల వసతి, రవాణా, విమానాశ్రయ కార్యకలాపాలు, వైద్య సేవలు, భద్రత, సామాను రవాణా, జమ్‌జమ్ పంపిణీ తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.హైదరాబాద్ నుండి జెద్దాకు హజ్ చార్టర్ విమానాలు మే 4 నుండి మే 21, 2026 వరకు నడవనున్నాయి. తిరుగు ప్రయాణ విమానాలు మదీనా నుండి హైదరాబాద్‌కు జూన్ 11 నుండి జూన్ 26, 2026 వరకు కొనసాగనున్నాయి. వృద్ధులు, మహిళలు, తొలిసారి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి మంత్రి అజారుద్దీన్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అధికారులు తెలిపారు. వారు గౌరవప్రదంగా, ప్రశాంతంగా తమ ఆధ్యాత్మిక యాత్ర పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

# ఆర్టీసీ సమ్మెకు బిఆర్ఎస్ సంఘీభావం

## ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని ప్రభుత్వం

హైదారబాద్,ఏప్రిల్22 : ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం తెలిపుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వంలోనే కేబినెట్ ఆమోదం తెలిపి, జీవో, గెజిట్ ఇచ్చామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిందే అమలు చేయమని ఆర్టీసీ కార్మికులు అడుగుతున్నారన్నారు.రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవడం వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ.3000 కోట్లు ప్రభుత్వం బకాయిలు పడింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకపోతుందని విమర్శించారు. కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలన్నారు.

# సంపాదకీయం

## ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి !

టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు..1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజలు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థయిర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజలు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పోరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.

# మహిళా బిల్లుకు మోక్షమెన్నడు?




దాదాపు మూడు దశాబ్దాల కల కలగానే మిగిలిపోనుందా అనే సందేహం మహిళలకే కాదు స్త్రీల ఉన్నతికి పాటుపడే వారందరి మదిలోమెదులుతున్న ప్రశ్న. 131 రాజ్యాంగ సవరణ మహిళా బిల్లు ఆమోదం పొందకపోవడంపై రకరకాల అనుమానాలు ఉత్పన్నం అవుతున్నాయి. మహిళా బిల్లు వీగిపోవడం ఇప్పుడు కొత్తేంకాదు. సుమారు ఆరు ఏడు సార్లు అయింది. ఎన్‌డిఏ కూటమి ఏమో మహిళా బిల్లుకు డీలిమిటేషన్ కలుపడంద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని విపక్ష నేతలు వ్యతిరేకించి ఓటు వేశారని అర్థమైంది. పార్లమెంట్ ఈ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు రావడంతో ఆమోదానికి అవసరమైన మూడింట రెండు వంతు 352 మెజారిటీ దక్కలేదు. 2/3 మెజారిటీకి 54 ఓట్లు తక్కువపడ్డాయి. మహిళా బిల్లు ఎన్‌డిఏ కుట్రలో భాగమని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎందుకంటే ఈ బిల్లు 2011 జనాభా లెక్కల ప్రకారం డీమిలిటేషన్‌తో ముడిపెట్టి ఓటింగ్ పెట్టడమే తప్పిదమని, బిజెపి చాణక్య నీతికి మించి అత్యుత్సాహం చూపుతున్నదని బలంగా వాదిస్తున్నారు ఇండియాకూటమి నేతలు. ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ రిజర్వేషన్‌పై కూడా స్పష్టతలేదు. అందుకే విపక్షాలు మద్దతు తెలుపలేదు. మహిళా బిల్లు వ్యతిరేకించిన వారిని దేశప్రజలు క్షమించరని, మహిళలను ఓటు అడిగే నైతిక హక్కు లేదంటుంది ఎన్‌డిఏ కూటమి. మహిళా బిల్లుపై ఎవ్వరికి ఎంత బాధ్యత ఉంది అనేది భవిష్యత్తులో తేలనుంది. ఎవరి వాదనలు ఎలా ఉన్న మహిళలు చట్టసభలలోకి వెళ్లడం వారి హక్కు ఇకనైనా మహిళలపై గౌరవంతో వీలైనంత త్వరగా మహిళా బిల్లు ఆమోదానికై కలిసికట్టుగా పనిచేయాలి. మహిళా బిల్లుకు చట్టబద్ధతకు ఎన్‌డిఏ కూటమి ఆమోదించేలా ఒత్తిడి పెంచాల్సిన బాధ్యత విపక్షాలపై ఉంది. ఎవరి పాత్ర వారు సమర్థవంతంగా నిర్వహించి చిత్తశుద్ధి కాపాడుకుంటారో ఆ పార్టీలను మహిళా లోకం గుర్తిస్తుందని మారువరాదు. దేశంలో కొన్ని రాష్ట్రాలు స్వయంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చిన వారి అధికారులను కూడా తమ ఇంట్లో వారు అధికార దర్పం చాటుకుంటున్నారు. మహిళా ప్రజాప్రతినిధులకు పూర్తి స్వేచ్ఛ లేదనే చెప్పవచ్చు. సమాన హక్కులతోపాటు చట్టసభల రిజర్వేషన్ కల్పించినప్పుడే మహిళలకు న్యాయం సంపూర్ణ జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం కూడా నిస్వార్థంగా మహిళా బిల్లును ఆమోదం తెలిపేలా చేసి ఉంటే మహిళల దృష్టిలో బిజెపికి ప్రత్యేకమైన ఆదరణ ఉండేదేమో. మరిన్ని కనుగొనండి ఎడిటోరియల్ సేవల ఎలక్ట్రానిక్ పేపర్ జిల్లా వార్తలు ూశ్రీంశీ =ఖుః – హడావుడి 'బిల్లు'తో సాధించిందేమిటి? రాజకీయ దూరదృష్టితో మహిళా బిల్లును కావాలనే సంపూర్ణ మద్దతు తెలుపడం లేదా అనే ఆలోచన మేధావులు, రాజకీయ విశ్లేషకులు, విద్యావంతులలో వస్తుంది. ఎందుకంటే జనాభా, కులాల ప్రాతిపదికన రిజర్వేషన్ అమలు చేయాలి అంటున్నాం. చట్టసభలలో కూడా 50% జనాభా ఉన్న మహిళలకు రిజర్వేషన్ ఎక్కడ ఉంది, వారికి రావాల్సిన వాటా హక్కు ఇవ్వాలి కదా, ఎందుకు జాప్యం చేస్తున్నారో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఏదిఏమైనపటికీ మహిళా బిల్లు రావాలి ఎందుకంటే శాసన నిర్మాణ, అభివృద్ధిలో మాహిళల పాత్ర ఉండాలి. ఈ సృష్టిలో నింగి నుండి నేల వరకు మహిళామణులు సేవలు అందిస్తున్నారు. రాజకీయాలలో మాత్రం మహిళలకు రావాల్సిన 33% పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 1/3 వంతు సీట్లు రిజర్వేషన్ అమలు చేయాలి కానీ మహిళా బిల్లు సుదీర్ఘ కాలంగా ఆమోదం పొందలేకపోయింది. చివరగా మహిళలు చైతన్యం అయితే తప్ప బిల్లు ముందుకు సాగదు. మహిళలు ఉద్యోగ విధులు నిర్వహించడమే కాకుండా ఇంట్లో వారికి సేవలు అందిస్తూ సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అందుకే స్త్రీ అంటే అబల కాదు సబల కావాలంటూ వీర వనితలను ఆదర్శంగా చూపెడుతాము. అలాంటిది దేశ రాజకీయాల్లో ఆశించిన ప్రాధాన్యత లేకపోవడం గమనార్హం. ఎందుకంటే స్వాతంత్ర్య పోరాటం మొదలుకుని సామాజిక ఉద్యమాల వరకు శంఖారావం పూరించిన ఘనత స్త్రీలదే అని చరిత్ర తెలుపుతుంది. స్త్రీలు ఏకమై కదంతొక్కుతూ ఉప్పెనలా కదిలితేనే మహిళా బిల్లు ఆమోదానికి అడుగులు పడతాయి. మహిళలను గౌరవించుకుంటూ ఏటా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ఘనంగా నిర్వహిచుకుంటూ మహిళలో చైతన్యం రావాలని నినదిస్తూ మహిళా బిల్లుపై అధికార, ప్రతిపక్షాలు మాటలు కోటలు దాటుతాయి. ఆచరణలోకి వచ్చే సరికి శూన్యం. పార్టీలు రాజకీయాలకు అతీతంగా మహిళల అభ్యున్నతి ముఖ్యమని భావించినప్పుడే మహిళా బిల్లు ఆమోదం పొందే అవకాశం ఉంది. ప్రపంచ ఉద్యమాలలో సైతం మహిళా పాత్రయే కీలకమైంది, మహిళలు వారి హక్కుల కోసం ప్రశ్నించే గళాలతో నినదించి పోరాడిన సందర్భాలు చూశాం. అదే ఒరవడితో మహిళా బిల్లుకై ఒక్కటై పోరాడాలి. 1975లో ఐక్యరాజ్యసమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించి వారి హక్కులకోసం పని చేస్తుంది. ప్రతి ఏటా మహిళల సాధికారతకై ఒక థీమ్ తీసుకు వస్తూ వారి అభివృద్ధిని ప్రోత్సాహిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పురుషులకు దీటుగా పోటీపడి అవార్డులు, రివార్డులు సాధిస్తున్నా వారి హక్కులను కాలరాస్తున్నాం. మహిళలను ప్రధానంగా పట్టిపీడించిన కొన్ని రుగ్మతలు బాల్యవివాహాలు, దేవదాసీ, సతీసహగమనం, నిరక్షరాస్యత వంటివి వారి వెనుకబాటుకు కారణమైనవని గతం తెలుపుతుంది. మరిన్ని కనుగొనండి తాజా వార్తల సేవలు క్రికెట్ మ్యాచ్ టిక్కెట్లు ూశీఖ్రీ చీవ఼ంూశ్రీంశీ =ఖుః – చర్చలకు 'యురేనియం' అడ్డంకి దశాబ్దాల కాలం తర్వాత మహిళలు చైతన్యమై సమాజంలో ముందుకు వెళ్తున్న తరుణంలో మహిళా రిజర్వేషన్ వారికి తోడ్పాటు అందిస్తే రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రగతి సాధిస్తారు. ఒక్కప్పుడు మహిళ అంటే వంట గదికే పరిమితం అనే ఆంక్షలను తెంచుకుని నేడు దేశాభివృద్ధిలో మహిళలదే పైచెయ్యిగా ఉంది. మహిళ అంటే ఒక శక్తిగా భావిస్తూ మహిళా బిల్లుకు జనమంతా జాగృతమై మద్దతు తెలుపుదాం. మహిళల పురోగతికి కృషి చేసిన మహనీయులైన కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, రాజారామోన్ రాయ్, జ్యోతిరావు పూలే వంటివారి ఆశయాలను గౌరవిస్తూ మహిళ సంక్షేమ, అభివృద్ధి చైతన్యాన్ని కాంక్షిస్తూ మహిళా బిల్లుకై ఏకమై ఉద్యమిద్దాం. స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాడిన వీరవనితలు ఝాన్సీ లక్ష్మిబాయ్, సరోజిని నాయుడు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ వంటి వారి త్యాగాలను యాదికి చేసుకుంటూ, స్త్రీ జనోద్ధారణకు కృషి చేసిన సావిత్రీ బాయ్ ఫూలే, తెగువకు ఐల్లమ్మ, పౌరుషానికి రాణి రుద్రమదేవి నేటికి ఆదర్శప్రాయులు వారి స్ఫూర్తితో మహిళలు సంఘటితం కావాలి, మహిళా బిల్లుకు ఏకమై గళమెత్తాలి.

## సీజ్‌ఫైర్ పొడిగిస్తూ ప్రకటన

### జెడి వాన్స్ ఇస్లామాబాద్ పర్యటన రద్దు



వాషింగ్టన్,ఏప్రిల్22 : ఇరాన్‌తో సీజ్‌ఫైర్‌ను పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో జరగాల్సిన శాంతి చర్చలు రద్దు అయ్యాయి. ఇక అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా తన పాక్ పర్యటన రద్దు చేసుకున్నట్లు వైట్‌హౌజ్ ధ్రువీకరించింది. ఈనెలలో రెండోసారి జేడీ వాన్స్ పాక్‌లో పర్యటించాల్సి ఉంది. ఇరానీ ప్రతినిధులతో ఓ డీల్ కుదుర్చుకునేందుకు ఆ ట్రిప్ జరగాల్సి ఉంది. కానీ కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో వాన్స్ జర్నీ నిలిపివేశారు. అయితే ఒకవేళ వ్యక్తిగత సమావేశాలు ఏమైనా ఉంటే దానిపై ప్రకటన చేస్తామని వైట్‌హౌజ్ అధికారులు చెప్పారు. ఇరాన్‌తో సీజ్గ్÷ర్‌ను నిరవధికంగా పొడిగించడం పట్ల ట్రంప్‌కు థ్యాంక్స్ చెప్పారు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్. మా రిక్వెస్ట్‌ను ఆమోదించి సీజ్గ్÷ర్ ప్రకటించడం సంతోషకరమని, దీని వల్ల దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగుతుంటాయని అన్నారు. పాకిస్థాన్‌పై విశ్వాసాన్ని, నమ్మకాన్ని ప్రదర్శించారని, ఇరాన్‌తో సమస్యను పరిష్కరించేందుకు దౌత్యపరంగా తమ ప్రయత్నాన్ని వీడబోమన్నారు. ఇరు దేశాలు సీజ్గ్÷ర్‌ను కొనసాగిస్తూ సమగ్రమైన శాంతి ఒప్పందాన్ని కుదుర్చు కుంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ కూడా ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతించారు. ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇది కీలకమైన అడుగు అని, దీని ద్వార దౌత్యం నిర్వహించేందుకు మార్గం సులువు అవుతుందని, అమెరికా–ఇరాన్ మధ్య విశ్వాసం పెరుగుతుందని సెక్రటరీ జనరల్ ప్రతినిధి స్టీఫానే దుజారిక్ తెలిపారు. సీజ్గ్÷ర్‌ను ఉల్లంఘించకుండా, నిర్మాణాత్మకంగా చర్చలు నిర్వహించాలన్నారు. శాంతి చర్చల అంశంలో పాక్ ఇచ్చిన మద్దతును ఆయన ప్రశంసించారు.


## కులాల మధ్య చిచ్చుతో రాజకీయ పబ్బం

### వైసిపి తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమండ్రి,ఏప్రిల్22(ఆర్ఎన్ఎ):రాష్ట్రంలో కులాల మధ్య విభేదాలు సృష్టించి.. రాజకీయ పబ్బం గడుపుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. 'కులాల మధ్య చిచ్చు పెడుతుంటే మేము చూస్తూ ఊరుకోం.. రాజకీయంగా పతనం కావడంతోనే జగన్ ఇలాంటి అరాచకాలకు తెరలేపారు' అని ఆయన విమర్శించారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్రంగా ఖండించారు. కాపు సామాజిక వర్గాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని, తన వ్యాఖ్యలను బ్లూ మీడియా ఉద్దేశపూర్వకంగా వక్రీకరించిందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికే సాక్షి పత్రికై బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ.. 'రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పనిచేస్తున్నాం. అంబటి అయినా గింబటి అయినా ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు. నా వ్యాఖ్యలను సాక్షి పత్రిక వక్రీకరించింది. జగన్ ఒక 'సూసైడ్ స్క్వాడ్'ను తయారు చేశారు. విచ్ఛిన్న శక్తులకు తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా మారింది. దేవాలయాలు, వ్యక్తుల పైనా దాడులు చేయిస్తున్నారు. జక్కంపూడి రాజా లాంటి వాళ్లను పిచ్చి ఆసుపత్రిలో చేర్చాలి. మాజీ ఎంపీ మార్గాని భరత్ రాజమండ్రి కంబాల చెరువు, దేవిచౌక్ ప్రాంతాలను అభివృద్ధి పేరుతో కంపుకొట్టించారు. కుర్రాళ్లు వాస్తవాలు తెలుసుకొని రాష్ట్ర భవిష్యత్తు గురించి మాట్లాడితే బాగుంటుంది. కూటమి ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే ఆలోచనా విధానంతో ముందుకు వెళ్తున్నారు.

## స్వర్గానికి దారిచూపే సద్భావం

'తల్లిదండ్రులతో సద్భావంతో మెలగండి. బంధువులూ, అనాథలూ, నిరుపేదలతో ఉన్నతంగా వ్యవహరించండి. ఇరుగుపొరుగు, మిత్రులు, బాటసారులు, దాసీ జనంతో ఉదార బుద్ధితో నడుచుకోండి' అని దివ్య ఖురాన్‌లో అల్లాహ్ ఉద్బోధించారు. దీన్నిబట్టి మన అమ్మానాన్నలు, బంధువుల పట్ల మనం ప్రదర్శించాల్సిన గౌరవం, వారిపట్ల మనకున్న హక్కులు, బాధ్యతలు ఏమిటో తెలుస్తున్నది. ఇస్లాం ప్రవచనం ప్రకారం మనల్ని చిన్నప్పుడు కంటికి రెప్పలా కాపాడిన మన తల్లిదండ్రులను వారి ముసలితనంలో కంటికి రెప్పలా కాపాడుకోవాలి. వారు మనకు విసుగు తెప్పించినప్పటికీ 'ఛీ' అని అనకూడదు. ఇక బంధువులు మనతో అనుచితంగా ప్రవర్తించినా, మనతో తెగదెంపులు చేసుకున్నా వారిపట్ల 'సిలారహ్మీ' (బంధుప్రేమ) కలిగి ఉండాలి. వారితో మంచిగా మెలగడం చాలా అవసరం. 'నీతో సత్సంబంధాలు పెట్టుకున్న వారితో నేనూ సత్సంబంధాలు పెట్టుకుంటాను. నీతో తెగదెంపులు చేసుకొనే వారితో నేనూ తెగదెంపులు చేసుకుంటా' అని అల్లాహ్ సృష్టిరాశులను సృష్టించినప్పుడు బంధుత్వానికి అభయమిచ్చారు. బంధువులను తెగదెంపులు చేసుకొనేవాడు స్వర్గంలోకి ప్రవేశించడని ఆయన స్పష్టం చేశారు. బంధువులను విడదీయడం లాంటి పాపకార్యాలకు పాల్పడకూడదని ఇస్లాం హెచ్చరిస్తున్నది. దానధర్మాల విషయంలో నిరుపేద బంధువులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇస్లాం హదీసుల హితవాక్యాల నేపథ్యంలో తల్లిదండ్రులు, బంధువుల పట్ల గౌరవం కలిగి ఉండి, వారిపట్ల కలిగి ఉన్న హక్కులను, బాధ్యతలను నెరవేర్చాలి.




ఆధ్యాత్మికం

# జన గర్జన కాదు... రాజకీయ భూకంపం!

● జగిత్యాల నుంచి మొదలైన గులాబీ గర్జన ● సభ కాదు సంకేతం... కారు మళ్లీ స్పీడ్‌లోకి ● బిఆర్ఎస్ యాక్షన్ మోడ్... కాంగ్రెస్ సైలెంట్ మోడ్ ● జోష్ లో గులాబీ... పరేషాన్ లో హస్తం ● ఇది సభ కాదు... రాబోయే రిజల్ట్ ట్రైలర్ ● ప్రజా ఆశీర్వాద సభ పై ది క్రైమ్ న్యూస్ స్పెషల్ స్టోరీ.... ● జగిత్యాలలో జరిగిన జన గర్జన ఒక సమావేశం కాదు... ఇది ఒక రాజకీయ హెచ్చరిక!

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల వేదికగా జరిగిన ప్రజా ఆశీర్వాద సభ... సాధారణ రాజకీయ ఈవెంట్‌గా చూడటం పెద్ద పొరపాటు. అది ఒక సంకేతం,ఒక స్పష్టమైన సందేశం.ముఖ్యంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి గట్టిగా వినిపించిన అలారం. గత కొంతకాలంగా నిశ్శబ్దంగా ఉన్న బిఆర్ఎస్ శ్రేణులు ఈ సభతో ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చాయి. గులాబీ జెండాలు కేవలం ఎగిరాయి, రెపరెపలాడాయి అనడం మాత్రమే కాదు... తిరిగి పోరాటానికి సిద్ధమయ్యాయని ప్రకటించాయి. కేడర్‌లో కనిపించిన ఉత్సాహం చూస్తే... ఇది రీఎంట్రీ కాదు, రీబిల్డ్ స్టార్ట్ అనిపించింది. రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ పాలనపై పెరుగుతున్న అసంతృప్తిఇప్పుడు స్పష్టంగా బయటపడుతున్న దశలో ఉంది. హామీలు ఇచ్చిన వేగంతో అమలు జరగకపోవడం, ప్రజల్లో నెమ్మదిగా అసహనాన్ని పెంచింది. బయటకి మౌనం ఉన్నా లోపల ఆలోచనలు మారుతున్నాయి. "ఇంకెంతకాలం?" అనే ప్రశ్నఇప్పుడు




గ్రామాల నుంచి నగరాల వరకూ ప్రతి గొంతులో వినిపిస్తున్నది. ఇక బిఆర్ఎస్ విషయానికి వస్తే... ఈ సభ వాళ్లకు కేవలం బూస్ట్ కాదు, మోరల్ రీచార్జ్. సర్పంచ్ ఎన్నికల్లో వచ్చిన అనుకూల ఫలితాలు ఇప్పటికే సంకేతం ఇచ్చాయి. ఇప్పుడు జన గర్జన దానికి ఆమోద ముద్ర వేసింది.ఇంకా ముఖ్యంగా... అధికార ఒత్తిళ్ల మధ్య కూడా వేలాది మంది కార్యకర్తలు సభకు రావడం... కేసీఆర్ నాయకత్వంపై ఉన్న బలమైన విశ్వాసానికి నిదర్శనం. ఇక కాంగ్రెస్ పరిస్థితిచూస్తే బయట శాంతి... లోపల కలహం అన్నట్టుగా ఉన్నది. "కట్టప్పలు పెరుగుతున్నారు" అని వాళ్లే చెప్పుకోవడం... పార్టీలో అంతర్గత విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలియజేస్తున్నాయి.ఇది బిఆర్ఎస్‌కు పెద్ద ప్లస్. ఎందుకంటే... ప్రజల్లో అసంతృప్తి, దానికి తోడు పార్టీలో అంతర్గత విభేదాలు ప్రత్యర్థికి అవకాశమే. ఇది ట్రైలర్ మాత్రమే... మెయిన్ పిక్చర్ ఇంకా ఉంది అంటున్నారు బిఆర్ఎస్ శ్రేణులు. కారు స్టార్ట్ అయింది... స్పీడ్ ఎక్కడ ఆగుతుందో చూడాలి. మొత్తానికి... జగిత్యాల జన గర్జన ఒక సభ కాదు, ఒక మలుపు.ఇది రాజకీయ వాతావరణాన్ని మార్చే ప్రారంభం కావొచ్చు.

# ఇస్లామిక్ ఉగ్రవాదులను పెంచిపోషించిన కాంగ్రెస్

● కాంగ్రెస్ డిఎన్ఏలోనే దేశవిద్రోహ కణాలు ● వైశమ్యాలు రెచ్చగొట్టేందుకే ప్రధానిపై వ్యాఖ్యలు ● కాంగ్రెస్ చీఫ్ ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బిజెపి నేతలు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** దేశంలో ఇస్లామిక్ ఉగ్రవాదుల ఆగడాలను పెంచిపోషిందే కాంగ్రెస్ పార్టీ అని, వారి డిఎన్ఏలోనే దేశవిద్రోహ కణాలు ఉన్నాయని భారతీయ జనతా పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్రమోదీ ఉగ్రవాది అంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికర్జునఖర్గే చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం ఆయన దిష్టిబొమ్మను బిజెపి శ్రేణులు దగ్ధం చేశాయి. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ రాజకీయ దాష్టిత్వాన్ని మరోసారి ఖర్గే వ్యాఖ్య రుజువు చేసిందని మండిపడ్డారు. పశ్చిమ బెంగాలుతో పాటు అస్సాం, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకం అవుతున్న వేళ ఖర్గే ఉద్దేశ్యపూర్వకంగానే ఈ నీతిమాలిన వ్యాఖ్యలకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఎన్నికల్లో ముస్లింల ఓట్లను ఆకర్షించడంలో భాగంగానే రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు దిగజారుడు రాజకీయాలకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 60యేళ్లపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ మరికొద్దిరోజుల్లో కనుమరుగు కాబోతున్నదని, దీన్ని జీర్ణించుకోలేకే దేశప్రజల మధ్య వైశమ్యాలు రెచ్చ గొట్టటానికి ఖర్గే వంటి నేతలు బిజెపి నేతలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అభ్యంతరం తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణాలో కూడా మూటాముల్లె సర్థుకోవాల్సిందేనని జోస్యం చెప్పారు. రెండు రాష్ట్రాల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దేశద్రోహుల భరతం పడతామని హెచ్చరించారు. ఈ నిరసనలో



బీజేపీ సీనియర్ నాయకులు పోల్సాని సంపత్ రావు,కావేటి రాజగోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుడ్ల సతీష్, మండల ఉపాధ్యక్షులు మేడగొని శివయ్య, కోశాధికారి గాదాసి సతీష్, ముంజ రాజేందర్, శివ, యువమోర్చ మండల అధ్యక్షుడు రేండ్ల వేణు, పోగుల రాజు, కుక్క అంజి, సిందే శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ రహదారి (హైవే) పరిసర గ్రామాల్లో శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- రోడ్డు పక్కన చెత్త పేరుకుపోకుండా కట్టుదిట్టమైన చర్యలు
- డీపీఓ, డీఎల్పీఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

నిర్వహించిన - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాజీవ్ రహదారి (హైవే) వెంట ఉన్న గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి, రోడ్డు పక్కన ఎక్కడా చెత్త పేరుకు పోకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణశ్రీ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రాజీవ్ రహదారి గర్రెపల్లి నుండి రామగుండం వరకు రోడ్డు పక్కన ఎక్కడా చెత్త వేయకుండా నిరంతరం శుభ్రత నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హైవే వెంట ఉన్న గ్రామాలు రోడ్డు పక్కల శుభ్రతను క్రమం తప్పకుండా నిర్వహించాలని, గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డు పక్కన చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని అన్నారు.ఈ సమావేశంలో జడ్పి సీఈఓ నరేందర్,సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## హాలియాలో శుభ్రత పనులపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**నల్గొండ (ది క్రైమ్ న్యూస్):** నల్గొండ జిల్లా హాలియా మున్సిపాలిటీలో మార్నింగ్ శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. పట్టణంలోని సాగర్ రోడ్డులో నిర్వహిస్తున్న మీడియన్ ప్లాంటేషన్ పనులను కూడా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మొక్కలకు పాదులు తీసి, క్రమపద్ధతిలో నీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే డివైడర్ల వెంట పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ పరిశుభ్రతకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు.

## ఘోష్ నివేదిక నిలిపివేత..... బిఆర్ఎస్ సంబరాలు




**మానకొండూర్, ఎప్రిల్22, (ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గీతా భవన్ చౌరస్తా వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జస్టిస్ ఘోష్ కమీషన్ నివేదికలను నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు సంతోషంతో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు ఆధ్వర్యంలో బుధవారం టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి నాయకులు సంబరాలు నిర్వహించారు.అనంతరం జీవి రామకృష్ణారావు మాట్లాడుతూ.... కోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంప పెట్టుకాగా కేసిఆర్ కు, బిఆర్ఎస్ పార్టీకీ నైతికంగా, మానసికంగా గెలుపును సాధించిందని హర్షం వ్యక్తంచేశారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ పై కేసిఆర్ ను ఏదో విధంగా ఇబ్బందులకు గురి చేయాలనే ఉద్దేశంతో 2024 మార్చి 14న జీవో6ను జారీ చేస్తూ ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన జస్టిస్ పిసి ఘోష్ కమీషన్ ఇచ్చిన నివేదిక తప్పుల తడకగా ఉందని భావించిన న్యాయస్థానం కేసిఆర్, హరీష్ రావులతో పాటు అధికారులపై నిబంధనలకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలు తీసుకోవద్దంటూ ఇచ్చిన తీర్పుకు యావత్ తెలంగాణ సంతోషం వ్యక్తం చేస్తుందని జీవి రామకృష్ణారావు తెలిపారు.

## ఘోష్ నివేదిక రద్దు, కాంగ్రెస్‌కు చెంప పెట్టు

- ఏల శేఖర్ బాబు



**బెజ్జంకి, ఎప్రిల్22 (ది క్రైం న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఎవరెన్ని కుట్రలు పన్నినా కాళేశ్వరం గెలిచి ధర్మమే గెలిచిందని హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జి ఏలా శేఖర్ బాబు ఒక ప్రకటను విడుదల చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్, హరీష్ రావుతో పాటు అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దన్న కోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంప పెట్టుకాగా కేసీఆర్ కు,బిఆర్ఎస్ పార్టీకీ గొప్ప విజయమని పేర్కొన్నారు. కేసీఆర్, హరీష్ రావులు కాళేశ్వరం జలాలను మానేరు, అన్నపూర్ణ రిజర్వాయర్ల ద్వారా రైతులకు నీరు అందించి వ్యవసాయ్యాన్ని పండగలా చేయగా భూగర్భ జలాలు సైతం పెరిగాయని కేసీఆర్, హరీష్ రావు లపై అక్కసుతో కేసులు బనాయించాలని చూస్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ కు ప్రజల నుండి గుణపాఠం తప్పదని శేఖర్ బాబు ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదు

- రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు
- ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, ఇద్దరికి జరిమానా



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదని రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు హెచ్చరించారు. రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన ముగ్గురిని బుధవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరిచారు. నిందితులలో ఒక వ్యక్తి రెండవసారి పట్టుబడటంతో మేజిస్ట్రేట్ అతనికి 3 రోజుల జైలు శిక్ష విధించగా, మిగిలిన 2 గురికి మొత్తం 4000 రూపాయల జరిమానా విధించారు. జైలు శిక్ష పడిన వ్యక్తిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపరాదని, నడిపినచో వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు వాహనానికి సంబంధించిన పత్రములు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రాంగ్ రూట్లో వెళ్లరాదని, అతివేగంగా వాహనాలను నడపకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు.

## అదమరిస్తే అంతే...మరి..

- రహదారి పక్కన ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



**బ్యూరో (ది క్రైమ్ న్యూస్):** విద్యానగర్ హరిహరనగర్ రోడ్డు నెంబరు2లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ఫ్యూజ్ బాక్స్ వైర్లు చేతికి అందేవిధంగా ఉండడంతో అదమరిస్తే ఏక్షణంలో ఏప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాం దోళన చెందుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు తక్కువ ఎత్తులో ఉండడంతో చుట్టూ రక్షణ వలయం లేకపోవడంతో రోడ్డు మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం వల్ల ప్రమాదం పొంచి ఉందని. ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతినిత్యం స్కూల్‌కి వెళ్లే బస్సులు, ఆటోలు, బైక్‌లు మెదలె ఇరుకు రహదారిలో నిత్యం వేలాదిగా ప్రయాణిస్తుంటారు. ఆకస్మికంగా వాహనాలు అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్ ను ఢీకొనె అవకాశం ఉంది. జనం రద్దీ సమయంలో షార్ట్ సర్క్యూట్ సంభవిస్తాయని ప్రజలు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుమీద ఆడుకునే పిల్లలు దీనిపక్క నుంచే విద్యార్థులు వెళ్తుంటారు.మరియు మూగజీవాలకు సైతం ప్రమాదం పొంచి ఉందని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం లేక పోవడం గృహాల మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ను వేరే చోటు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## నిధుల మంజూరుపై కలెక్టర్ చొరవ తీసుకోవాలి: కార్పొరేటర్ కాల్వ మల్లేశం



**తిమ్మాపూర్, ఎప్రిల్ 22(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరులోని ప్రాథమిక పాఠశాలను స్థానిక కార్పొరేటర్ కాల్వ మల్లేశం బుధవారం పరిశీలించారు.బిల్లులు రాక భవన నిర్మాణం ఆగిందని తెలుసుకున్న కార్పొరేటర్, అధికారులతో మాట్లాడి బిల్లులు విడుదలైయ్యేలా చర్యలు తీసుకుంటానని, పనులను పునఃప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు చరవాణి ద్వారా మల్లేశం సూచించారు.భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకోవాల్సిందిగా కలెక్టర్ కు కాల్వ మల్లేశం పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.

## కవ్వంపల్లికి డిసిసి ప్రధాన కార్యదర్శి కృతజ్ఞతలు



**తిమ్మాపూర్, ఎప్రిల్ 22(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీకి చెందిన దావు సంపత్ రెడ్డి రెండు రోజుల క్రితం జరిగిన డిసిసి నూతన కమిటీ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లిని దావు సంపత్ రెడ్డి హైదరాబాద్లో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు గోగూరి నర్సింహారెడ్డి, మాచర్ల శ్రీనివాస్, మొండయ్య యాదవ్ తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

# కేసీఆర్‌ను తిట్టించడానికే మీటింగ్ పెట్టించిన దుద్దిళ్ల శ్రీధర్...

● సీఎం మాటలు విని సమాజమంతా అసహించుకుంటున్నరు ● ముఖ్యమంత్రి వస్తే ఈ ప్రాంతానికి అభివృద్ధి బాటలు పడాలే ● ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలు సమాధానం చెప్పాలే ● కాళేశ్వరం కూలిందన్న సీఎం కాన్వాయ్‌లో ఎలా వెళ్లిండో చెప్పాలే ● రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన నాయకుడు కేసీఆర్ ● మిమ్మల్ని చింతబరిగెలతో కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నయ్ ● ప్రెస్‌మీట్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**రామగిరి, ఏప్రిల్ 22(ది క్రైమ్ న్యూస్):-** ఆనాడు తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణాకు వ్యతిరేకంగా ఆనాటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి నీ వల్లెంకుంటకు తీసుకువచ్చి తెలంగాణ వాదాన్ని అణిచివేయాలని చూసిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఈనాడు తెలంగాణ ఉద్యమనేత మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టించడానికే కాటారం మండలంలో మీటింగ్ పెట్టి సీఎం రేవంత్‌రెడ్డిని తీసుకువచ్చాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. బుధవారం కాటారం మండల కేంద్రంలో భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నస్తూరిపల్లిలో కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో నిర్వహించిన మీటింగ్ కాటారం మండలాన్నే అపవిత్రం చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి గొంతెత్తి మాట్లాడితే గొప్పగా అనుకుంటున్నాడేమో గానీ ఆయన మాటలు విని సమాజమంతా అసహించు కుందని అన్నారు. ముఖ్యమంత్రి అనే విషయాన్ని మర్చిపోయి మురికినోటితో నోటికచ్చినట్లు మాట్లాడాడని, ఒక మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్‌ను చెట్టుకు కట్టేసి కొడుతామంటాడా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి బుద్ధి లేకుండా మట్లాడుతుంటే పక్కనే బుద్ధి ఉన్న మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల నిలువరించాలి కదా అన్నారు. అంటే కావాలనే కేసీఆర్‌ను తిట్టించడం కోసమే ఇక్కడ మీటింగ్ పెట్టించాడని అర్థం అవుతుందన్నారు. ఆనాడు పీవీ నర్సింహరావు నాలుగు సార్లు మంథనికి ప్రాతినిధ్యం వహించారని, ఆయనకు ఓట్లు వేసి గెలిపించుకున్న గడ్డ మంథని అని ఆయన గుర్తు చేశారు. ప్రజాపాలన ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిందని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఆరు గ్యారెంటీలు, 420హమీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సన్నబియ్యం, ఉచిత బస్సు, ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీల గురించి చెప్పి భుజాలు చరుసుకుంటున్నారని, ఇచ్చిన హామీలెన్నీ అనే విషయాన్ని ఎందుకు చెప్పడం లేదన్నారు. మానిఫెస్టో కమిటి చైర్మన్ మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ రాసిన గ్యారెంటీ కార్డులో నాలుగే ఉన్నయా అని ప్రశ్నించారు. అందులో మహిళలకు 2500, రైతులకు 15వేలు, కౌలు రైతులకు ఇస్తమన్నవి ఏవీ అని ప్రశ్నించారు. పించన్‌లు పెంచకుండా, యువ వికాసం అమలు చేయకుండా గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. మూడేళ్లకు 3వేల ఇండ్లు మంజూరీ చేసిండ్లవి అవి కూడా ఎన్నికలు వచ్చిన సమయంలోనే ఓట్ల కోసం ఇచ్చారని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన నాయకుడు కేసీఆర్‌ని చెట్టుకు కట్టేసి కొడుతా అంటారా , చిన్నా పెద్దా అనే తేడా లేకుండా మాట్లాడటం ఎంతవరకు సమంజసమన్నారు. ఆనాడు వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలు అమలు చేస్తమని తొమ్మిదివందల రోజులైనా అమలు చేయకపోవడం చేతకాని తనానికి నిదర్శనమన్నారు.సీమాంధ్రుల చెప్పులు మోసిన రేవంత్‌రెడ్డి ఆనాడు ఉద్యమకారులను తుపాకులతో బెదిరించిన విషయం ఇంకా ప్రజలు మర్చిపోలేదన్నారు. కాళేశ్వరం కూలిపోయిందని ఇక పనికిరాదని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి నిన్న అదే కాళేశ్వరం మీదుగా కాన్వాయ్‌లో ఎలా వెళ్లావని ప్రశ్నించారు. ఒక ముఖ్యమంత్రి ఒక ప్రాంతంలో జరిగే మీటింగ్ వస్తున్నాడంటే ఆ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించడమో, ఏదైనా పరిశ్రమను తీసుకురావడమో జరుగుతుంది కానీ ఇక్కడ మాత్రం కేవలం కేసీఆర్‌ను తిట్టాలనే ఆలోచనతోనే మిటింగ్ పెట్టారన్నారు. నియోజకవర్గంలో అనేక వనరులు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని పరిశ్రమనో, ఫ్యాక్టరీనో తీసుకువచ్చి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకశాలు కల్పించాలని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఆలోచన చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 40ఏండ్లుగా దుద్దిళ్ల కుటుంబానికి ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే ఏ ఒక్కరికి మేలు చేయకపోగా వేలకోట్ల రూపాయలు సంపాధించుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. ఈనాడు చిన్నకాళేశ్వరం పూర్తి చేస్తామని సీఎం మాట్లాడటం విడ్డూరంగా ఉందని, ఆనాడు తమ ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే చిన్న కాళేశ్వరం పూర్తి చేస్తామని మంథని ఎమ్మెల్యే మాట్లాడాడని, అంటే ప్రజలను చిన్న కాళేశ్వరం పేరుతో మరోసారి మోసం చేశాడని అర్థం అవుతుందన్నారు. ఆరెంద మానేరుపై వంతెనకు ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశాడని, ఆ పనులు ఎన్నడు మొదలు పెడుతారో అర్థం కావడం లేదన్నారు. డిసెంబర్ 04న మంథని గోదావరినదిపై వంతెనకు శిలాఫలకం వేశాడని, కానీ రెండున్నర ఏండ్ల క్రితమే వంతెనకు జీఓ వచ్చిందని, శిలాఫలకం వేసి ఏడాది కాబోతుందని ఇప్పటి వరకు పనులు ముందుకు సాగడంలేదన్నారు. కేవలం అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం చేస్తారని, అబద్దాలతోనే అధికారం నడిపిస్తారని ఆయన ఎద్దేవా చేశారు. ఆనాడు కేసీఆర్ తెలంగాణాను సాధించకపోతే ఈనాడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవాడా దుద్దిళ్ల శ్రీధర్ మంత్రిగా ఉండేవాడా అని ప్రశ్నించారు. మీ మాటలు, మీ అబ్దాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రేవంత్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌లను చింతబరిగెలతో కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఆయన హితవు పలికారు.

# డ్యూటీ సమయాల్లో భారీ లారీల రాకపోకలను నియంత్రించాలి

**- గాయపడిన కార్మికుడికి తగిన పరిహారం, ఉత్తమ వైద్యం అందించాలి - ఈ ఘటనపై తక్షణమే నిష్పక్షపాత విచారణ జరిపించాలి**

**- బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి - బీజేపీ ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్**



**రామగిరి, ఏప్రిల్ 22(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి పన్నూర్ సింగరేణి చెక్‌పోస్ట్ సమీపంలో జరిగిన దుర్ఘటనలో సింగరేణి ఏఎల్పీ కార్మికుడు కోము సందీప్ తీవ్రంగా గాయపడటం అత్యంత బాధాకరమని, డ్యూటీ సమయాల్లో లారీ రాకపోకలను పూర్తిగా నిషేధించాలని బీజేపీ ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ అన్నారు.వారు మాట్లాడుతూ ఈ ఘటన ఒక సాధారణ ప్రమాదం కాదు ఇది స్పష్టమైన అధికారుల పరిపాలనా కు నిర్లక్ష్య ఫలితం. డ్యూటీ సమయాల్లో భారీ లారీల రాకపోకలను నియంత్రించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు తమ విధులను నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. కార్మికుల ప్రాణ భద్రతను పట్టించుకోకపోవడం చట్టపరంగా కూడా తీవ్రమైన తప్పిదంమని భారతదేశంలో అమల్లో ఉన్న మోటార్ వెహికల్స్ యాక్ట్ 1988, సంబంధిత రోడ్డు భద్రత నియమాల ప్రకారం, కార్మిక ప్రాంతాల్లో వాహనాల నియంత్రణ, భద్రతా చర్యలు తీసుకోవడం తప్పనిసరి. ఈ చట్టాలను అమలు చేయకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతమవు తున్నాయని అన్నారు. ఇప్పటికే పలుమార్లు కార్మికులు, స్థానికులు లారీలు డ్యూటీ టైంలో నడపవద్దని విజ్ఞప్తులు చేసినప్పటికీ, అధికారులు పట్టించుకోకపోవడం చాలా దురదృష్టకరం అని ఇది కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాదు కార్మికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే చర్యలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. ముఖ్యంగా భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం నిర్లక్ష్యం వల్ల ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయని అన్నారు. **మా ప్రధాన డిమాండ్లు:** ఈ ఘటనపై తక్షణమే నిష్పక్షపాత విచారణ జరిపించాలి. బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. గాయపడిన కార్మికుడికి తగిన పరిహారం మరియు ఉత్తమ వైద్యం అందించాలి. డ్యూటీ సమయాల్లో లారీ రాకపోకలను పూర్తిగా నిషేధించాలి. సింగరేణి ప్రాంతాల్లో కఠినమైన రోడ్డు భద్రతా నియమాలు అమలు చేయాలి. సింగరేణి సంస్థలో వేలాది కార్మిక కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. వారి ప్రాణ భద్రతను నిర్లక్ష్యం చేయడం అనేది అసహ్యం, అన్యాయం. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోకపోతే, మేము చట్టపరమైన పోరాటానికి సిద్ధంగా ఉన్నాము. బీజేపీ ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస, తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్, దొంతుల సురేష్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయితో పట్టుబడ్డ యువకుడు కేసు నమోదు చేసిన పోలీసులు




**ధర్మపురి, ఎప్రిల్ 22, (ది క్రైమ్ న్యూస్):** గంజాయితో పట్టుబడ్డ యువకుదీని ధర్మపురి పోలీసులు కేసు నమోదు అరెస్ట్ చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. బుధవారం ఉదయం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండల కేంద్రానికి చెందిన ప్రణీత్ కుమార్ అనే వ్యక్తి కొన్ని సంవత్సరాల నుండి గంజాయి తాగడానికి అలవాటు పడ్డట్లు పోలీసులు తెలిపారు. అదే విందంగా గంజాయి తీసుకుని ధర్మపురి ప్రాంతం లోని హెచ్. పి. పెట్రోల్ బంకు దగ్గర ఉన్న సమయంలో ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు వెళ్లి చాకచక్యంగా పట్టుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. అనంతరం అదుపులోకి తీసుకుని అతడిని విచారించగ అతడి వివరాలు తెలిపినట్లు తర్వాత అతడి దగ్గర 60 గ్రాముల నిషేధిత గంజాయి ని స్వాధీన పరచుకుని ఇద్దరు పంచుల సమక్షంలో దానిని సీజ్ చేయడం జరిగిందని ఎస్సై వివరించారు. నిందితుడి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మపురి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మహేష్ తెలిపారు. మాదకద్రవ్యాలు సేవిస్తూ లేదా పట్టుబడిన ఉపేక్షించేది లేదని కఠినమైన కేసులు వేసి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయిని అరికట్టడమే ప్రధాన ధ్యేయమని ఎస్సై మహేష్ తెలిపినారు.

# జిల్లా అక్రిడేషన్ కమిటీలో జెఎస్ఎస్‌కు ప్రాతినిధ్యం కల్పించాలి

**- సీనియర్ జర్నలిస్టు బందెల రాజశేఖర్ కు అవకాశం కల్పించాలి - జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్**



**రామగిరి, ఏప్రిల్ 22(ది క్రైమ్ న్యూస్):-** పెద్దపల్లి జిల్లా అక్రిడేషన్ కమిటీలో జర్నలిస్టుల సంక్షేమ సంఘానికి ప్రాతినిధ్యం కల్పించాలని, జెఎస్ఎస్ తరపున సీనియర్ జర్నలిస్టు బందెల రాజశేఖర్ కు మీడియం పత్రికల తరపున అవకాశం కల్పించాలని జెఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్ కోరారు. బుధవారం జేఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జేఎస్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం వారి హక్కుల కోసం పోరాటం చేస్తుందని తెలిపారు.అందుకుగాను జేఎస్ఎస్ కు జిల్లా అక్రిడేషన్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. జేఎఎస్ఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సీనియర్ జర్నలిస్టు బందెల రాజశేఖర్ వివిధ పత్రికల్లో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని ఆయనకు మీడియం పత్రికల తరఫున పెద్దపల్లి జిల్లా అక్రిడేషన్ కమిటీలో అవకాశం కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓడ్నాల తిరుపతి,పెద్దపల్లి జిల్లా ఇన్చార్జి కన్నూరి రాజు,ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బందెల రాజశేఖర్ పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ మల్లన్నను కలిసిన తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపకులు ఆరెల్లి మల్లేష్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి మున్సిపల్ నూతన చైర్మన్ నూగిళ్ల మల్లన్నను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపకులు ఆరెల్లి మల్లేష్, పాత్రికేయులు కుషనపల్లి సహకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం పెద్దపల్లి మున్సిపల్ ఆఫీస్‌లోని చైర్మన్ ఛాంబర్‌లో మల్లన్నను కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే నంబర్ వన్ దిశగా అభివృద్ధి చేయాలని మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లన్నను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మున్సిపల్ యంత్రాంగం చురుగ్గా వ్యవహరించాలని, పట్టణ సుందరీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

# మృతి చెందిన ఏజెంట్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**హుజురాబాద్ ఏప్రిల్ 22 (ది క్రైమ్ న్యూస్):** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎల్ఐసి ఏజెంట్ కుసుమ శ్రీనివాస్ కుటుంబానికి ఎల్ఐసి ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జమ్మికుంటకు చెందిన కుసుమ శ్రీనివాస్ ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఈ ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పంజాల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చందుపట్ల నరసింహారెడ్డి, డైరెక్టర్ కొండ తిరుపతి, సంఘ సభ్యులు వడ్డే రమేష్, నాగవెల్లి శ్రీనివాస్, బుచ్చి రాములు తదితరులు పాల్గొన్నారు.

## సెంటినరీ కాలనీ నూతన కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షునిగా నియమితులైన పెద్ది సమ్మయ్య

**- నూతన కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు పెద్ది సమ్మయ్యకు ఘనంగా సన్మానం**



**రామగిరి, ఏప్రిల్ 22(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండల కేంద్రంలోని సెంటనరీ కాలనీ కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడిగా పెద్ది సమ్మయ్యని ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు నియమించడం జరిగినది. రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని ఐఎన్టీయూసీ శ్రీపాద భవనంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న పెద్ది సమ్మయ్య కు నియామక పత్రం అందజేశారు. ఇట్టి నియామకం నేటి నుండి అమల్లోకి వస్తుందని అన్నారు.ఈ సందర్భంగా పెద్ది సమ్మయ్య మాట్లాడుతూ ఎన్నికకు కృషిచేసిన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్,రామగిరి మండల శాఖ అధ్యక్షుడు రొడ్డ బాపన్న, పన్నూర్ సర్పంచ్ చిందం మహేష్ సెంటనరీ కాలనీ మాజీ పట్టణ శాఖ అధ్యక్షులు కాటం సత్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పన్నూర్ సర్పంచ్ చిందం మహేష్, సెంటినరీ కాలనీ టౌన్ మాజీ అధ్యక్షులు కాటం సత్యం, పన్నూర్ యూత్ అధ్యక్షులు ఏరావేనా అజయ్ యాదవ్ పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన గ్రంధాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్



**ధర్మపురి, ఎప్రిల్ 22, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం లోని రాయపట్నం గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారిధాన్యం కొనుగోలు సెంటర్ ని గ్రామ సర్పంచ్ రాందేని మొగిలి, ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య గార్ల తో కలిసి కొనుగోలు సెంటర్ ని బుధవారం జగిత్యాల జిల్లా గ్రంధాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్ ప్రారంభించారు. ఐకేపీ కొనుగోలు సెంటర్ లో రైతులు ఇబ్బందులు పడకుండా మంచినీరు అందుబాటులో ఉండే విధంగా తాగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాగారం గ్రామ సర్పంచ్ చిలుముల లక్ష్మణ్, రాయపట్నం ఉప సర్పంచ్ చిలుక రామన్న, ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాక్షులు వేముల రాజేష్, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గటికే కమలాకర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తనుగుల తిరుపతి, ముక్కర అంజి, ప్రశాంత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# సైబరాబాద్‌లో ఆహార కల్తీపై దాడులు

## ● 22 కేసులు నమోదు 28 మంది అరెస్ట్





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆహార కల్తీ, అక్రమ ఆహార తయారీ కార్యకలాపాలను అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం జనవరి 1, 2026 నుండి ఏప్రిల్ 21, 2026 వరకు విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో భాగంగా మొత్తం 22 కేసులు నమోదు చేసి, ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే వివిధ నేరాల్లో పాల్గొన్న 28 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్లలో ముఖ్యంగా బేకరీ ఉత్పత్తులు, స్వీట్లు, నమకీన్ పదార్థాలు, తినదగిన నూనెలు, గోధుమ పిండి, అల్లం-వెల్లుల్లి పేస్ట్, మాంసాహార ఉత్పత్తులు, ఐస్‌క్రీమ్స్, సాస్‌లు, వంటనూనెను అక్రమంగా మళ్లీ వినియోగించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పలుచోట్ల గడువు ముగిసిన పదార్థాలు, కృత్రిమ రంగులు, ప్రమాదకర రసాయనాలు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. అలాగే అనేక యూనిట్లు సరైన ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లేదా ట్రేడ్ లైసెన్సులు లేకుండా, అత్యంత అస్వచ్ఛమైన పరిస్థితుల్లో ఆహార పదార్థాలను తయారు చేసి నిల్వ చేస్తున్నట్లు బయటపడింది. ఒక ప్రధాన కేసులో భారీ స్థాయిలో తినదగిన నూనె, గోధుమ పిండిలో కల్తీ జరుగుతున్నట్లు గుర్తించి, సుమారు 5,026 లీటర్ల నూనె, 5,192 కిలోల పిండి స్వాధీనం చేసుకున్నారు. అలాగే హానికర ప్రిజర్వేటివ్‌లు ఉపయోగించి నకిలీ బ్రాండింగ్‌తో అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న అక్రమ యూనిట్లను కూడా గుర్తించారు. మొత్తంగా కల్తీ ఆహార పదార్థాలు, యంత్రాలు, వాహనాలు కలిపి సుమారు రూ.64.07 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ఎల్లప్పుడూ లైసెన్సు ఉన్న వ్యాపారుల వద్ద నుంచే ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలని, గడువు తేదీలను తప్పనిసరిగా పరిశీలించాలని, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసులకు లేదా ఫుడ్ సేఫ్టీ శాఖకు తెలియజేయాలని అధికారులు ప్రజలకు సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఇలాంటి నేరాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు.

# సైబర్‌బాద్ క్లీన్ స్వీప్ డ్రైవ్ కార్యక్రమం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సైబర్‌బాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషి నగర్, ప్రశాంత్ నగర్, స్టాలిన్ నగర్, ఎమ్ఏ నగర్ కాలనీలలో నిర్వహించిన సైబర్‌బాద్ క్లీన్ స్వీప్ డ్రైవ్ కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సైబర్‌బాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, జలమండలి అధికారులు కాలనీ వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఏసీ ఛైర్మన్ గాంధీ మాట్లాడుతూ కాలనీలలో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ప్రతి విభాగానికి చెత్త సేకరణ కోసం ప్రత్యేకంగా ఆటోలు, టిప్పర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా నిర్మాణ వ్యర్థాలను తొలగించేందుకు ప్రతి రెండు విభాగాలకు ఒక టిప్పర్, ఒక జేసీబీ యంత్రం వినియోగంలో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగం ఫుట్‌పాత్‌లు, మధ్యస్థల మరమ్మతులు చేపడుతుండగా, టౌన్ ప్లానింగ్ విభాగం ఆక్రమణల తొలగింపులో పాల్గొంటోంది. ఎలక్ట్రికల్ విభాగం వేలాడుతున్న వైర్లను తొలగిస్తుండగా, ఉద్యానవన విభాగం చెట్ల కొమ్మల కత్తిరింపు, తోటల నిర్వహణ చేపడుతోంది. రోడ్లపై చెత్తను తొలగించి పరిశుభ్రతను పెంపొందించడం ద్వారా పౌరుల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని గాంధీ పేర్కొన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సైబర్‌బాద్ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీ వాసులు పారిశుద్ధ్య సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తారానగర్ రోడ్డు విస్తరణపై పునరాలోచన చేయాలి: రవికుమార్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తారానగర్ రోడ్డు విస్తరణపై పునరాలోచన చేయాలని రవికుమార్ యాదవ్ అధికారులను కోరారు. బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం తారానగర్‌లోని శ్రీ తుల్జా భవానీ అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ అభ్యర్థి రవికుమార్ యాదవ్ దర్శించుకున్నారు. అనంతరం ఆయన స్థానిక చిరు వ్యాపారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తారానగర్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు రవికుమార్ యాదవ్‌ను కలిసి, పోచమ్మ గుడి నుండి హనుమాన్ గుడి వరకు ప్రతిపాదించిన 100 అడుగుల రోడ్డు విస్తరణ వల్ల తమకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సుల్తాన్ బజార్, బేగం బజార్‌ల తరహాలో తారానగర్ మార్కెట్ కూడా మూడు తరాలుగా కొనసాగుతోందని, ఈ విస్తరణ వల్ల చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు, నివాసులు, ఉద్యోగులు వంటి వేలాది కుటుంబాల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ప్రతిపాదిత 100 అడుగుల రోడ్డు విస్తరణను 60 అడుగులకు తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై స్పందించిన రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పేరుతో ఇక్కడి వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినకూడదని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే వ్యాపారం చేస్తూ జీవిస్తున్న వారి పొట్ట కొట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనపై పునరాలోచించి, వ్యాపారులకు ఎటువంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికుల సమస్యలు తనకు బాగా తెలుసని, వారికి అన్యాయం జరిగితే భారతీయ జనతా పార్టీ తరఫున పోరాటానికి ముందుండి తమ హక్కులను సాధించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, ఎల్లేష్, శ్రీనివాసరెడ్డి, రామ్ రెడ్డి, రాజు శెట్టి, దినేష్, మల్లేష్ గౌడ్, విజయ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బీజేపీ నాయకులు



**ధర్మపురి, ఎప్రిల్ 22, (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం చేసినట్లు ధర్మపురి బీజేపీ పార్టీ నాయకులు తెలిపారు.బుధవారం తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార భాగంలో ఒక మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ని ఒక ఉగ్రవాదిగా ఒక టెర్రరిస్ట్ గా మాట్లాడిన వాక్యాలను భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ తీవ్రంగా ఖండిస్తూశీదని పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర శాఖ జిల్లా శాఖ ఆదేశాల మేరకు బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ లు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అన్నిటికీ శాంతి దూతగా ఉండాలని కోరుతున్నటువంటి వ్యక్తి నరేంద్ర మోడీ అని ఒక వయస్సు మళ్లీ నటువంటి వ్యక్తి భారత ప్రధాని నరేంద్ర మోడీ ని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గే టెర్రరిస్టుగా అనడం ఏదైతే ఉందో దీన్ని తీవ్రంగా ఖండిస్తూన్నాం అని పేర్కొన్నారు. కేవలం ఓట్ల కోసం కక్కుర్తి పడి ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని ఈ సందర్భంగా అయిన హెచ్చరిశీచారు. ప్రపంచ శాంతి దూతగా ఉండాలని ప్రపంచాన్ని శాసించే వ్యక్తి ట్రంపు లాంటి వ్యక్తులే యుద్ధం ఆపే విధంగా చేయాలని చెప్పినటువంటి గొప్ప వ్యక్తి నరేంద్ర మోడీ అని స్పష్టం చేశారు. అలాంటి వ్యక్తిని విమర్శించడం ఏదైతే ఉందో ఆకాశం మీద ఉమ్మి వేయడం లాంటిదేనని ఇక ముందు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ నాయకులు రోడ్లమీద తిరగకుండా చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరిశీచారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయ విలువలు తెలుసా తెలవదా అని ప్రశ్నించారు. ఇదే ఖర్గే ఒక సమావేశంలో ఆర్ఎస్ఎస్ ను బిజెపి కార్యకర్తలు ఎక్కడపడితే అక్కడ చంపమని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపు ఇవ్వడం జరిగిందని ఇట్టి విషయాన్ని కూడా మేము గుర్తు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఒక దేశ విద్రోహ పార్టీ, కాంగ్రెస్ పార్టీ విలువలు సంస్కృతి లేని ఒక విదేశీ పార్టీ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గే కేవలం నరేంద్ర మోడీ నే కాదు యావత్ దేశ ప్రజలందరినీ అవమానించే విధంగా మాట్లాడన్ని ఖండిస్తూ వెంటనే బేషరతు గా నరేంద్ర మోడీ కి దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ డిమాండ్ చేస్తూశీదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమదాస్ సత్యనారాయణ, సంఘీ మాధవ్, సీనియర్ నాయకులు తోట శ్రీనివాస్, యువ మోర్చా నాయకులు మండలోజీ సూరజ్, పట్టణ ఉపాధ్యక్షులు సుంకు మధుసూదన్, కార్యదర్శులు ఠాగూర్ రాకేష్, కలకోట రాజు, శ్యాం రావు నాగులు, సోమిశెట్టి శివ సాయి, పూదరి పవన్, మామిడి రంజిత్, సోషల్ మీడియా ఇన్చార్జి కాశెట్టి హరీష్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# అంగడి బజార్‌లో అక్రమ నిర్మాణాలపై మున్సిపాలిటీ చర్యలు



**నల్గొండ, ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అంగడి బజార్‌లో రహదారిని ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలపై మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల. శ్రీనివాస్ రెడ్డి చర్యలు ప్రారంభించారు. రహదారి ఆక్రమణల కారణంగా వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు, వాహనదారులు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నేడు జెసిబి యంత్రాల సహాయంతో రహదారిపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా సూచనలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, అంగడి బజార్‌లో రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు చేసిన వారు స్వచ్ఛందంగా వెంటనే వాటిని తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. లేనిపక్షంలో మున్సిపాలిటీ సిబ్బంది ద్వారా వాటిని తొలగించబడతాయని స్పష్టం చేశారు.

# పోలంపల్లిలో ఐకెపి సెంటర్ ప్రారంభం.....!



**తిమ్మాపూర్, ఎప్రిల్ 22(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లిలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఐకెపి సెంటర్ ను ప్రారంభించారు. సర్పంచ్ గుంటి లావణ్య, ఉప సర్పంచ్ మెరుగు మోహన్ మాట్లాడుతూ.... గ్రామంలోని రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మకుండా ఐకెపిలోనే అమ్మి సన్న వడ్ల బోనస్ ను పొందాలని సూచిస్తూ ఐకెపిలో ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించడంలో పాలకవర్గం ముందుంటుందని రైతులకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి రమేష్ గౌడ్, వార్డు సభ్యులు రాములు, మానస, రాజమణి, నాయకులు గుంటి మల్లేశం, బుడిగేసంపత్, బోయిని తిరుపతి, వెంగలఎల్లేష్, వివో సంఘాల అధ్యక్షులు తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామాగా పన్నూర్ గ్రామాన్ని తీర్చి దిద్దుతాం

**- పన్నూర్ లో రోడ్డు శుభ్రం చేయు నూతన యంత్రం ప్రారంభం - పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్**



**రామగిరి, ఏప్రిల్ 22(ది క్రైమ్ న్యూస్):-** ప్రజల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని గ్రామంలో అభివృద్ధి చేయాలనే బలమైన సంకల్పంతో పనిచేయడం రామగిరి మండలం పన్నూర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి లో భాగంగా సెంటనరీ కాలనీ, శివరాం నగర్, వకీల్ పల్లె, లద్నాపూర్ కాలనీల్లో బుధవారం రోజున రోడ్లపై చెత్త చెదారం, దుమ్ము శుభ్రం చేయటం కొరకు పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్ పాలక వర్గం తీర్మానం చేయగా రోడ్డు స్విపింగ్ యంత్రం కొనుగోలు చేయడం జరిగింది.ఇట్టి రోడ్డు స్విపింగ్ యంత్రం ను పన్నూర్ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రారంభించడం జరిగింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీవో ఏమ్.సమ్మి రెడ్డి, సెక్రటరీ ప్రేమ లత, వార్డు సభ్యులు తన్నీరు ప్రదీప్, సల్పాలా సదనందం, తాండ్ర ప్రశాంత్, కలువల రఘుపతి, ఎండీ నూర్జహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధం మురళీ, పెరుమాండ్ల అభి, మోతుకూరి సాయి, బత్తుల శంకర్, అహ్మద్ పాషా, ఇజ్జగిరి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.


# సింగరేణి సంస్థ రక్షణ కోసం పోరాడుదాం కార్మిక హక్కులను కాపాడుకుందాం

**- ఈనెల 28న చలో విద్యుత్ సౌధా హైదరాబాద్ ముందు చేపట్టే ధర్నా ను విజయవంతం చేయండి - సీఐటీయూ ఆర్.జీ-త్రీ బ్రాంచి కార్యదర్శి దొమ్మటి కొమురయ్య**



**రామగిరి, ఏప్రిల్ 22(ది క్రైమ్ న్యూస్):-** రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన వేల కోట్ల రూపాయలు వెంటనే చెల్లించాలని ఆర్.జీ-త్రీ లోని ఓసీ-టు లో చలో హైదరాబాద్ పోస్టర్ ను సీఐటీయూ ఆర్.జీ-త్రీ బ్రాంచి కార్యదర్శి దొమ్మటి కొమురయ్య ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.జీ-త్రీ బ్రాంచి కార్యదర్శి దొమ్మటి కొమురయ్య మాట్లాడుతూ 46 వేల కోట్ల రూపాయలు ట్రాన్స్కో, జెన్ కో ఐన విద్యుత్ సంస్థల నుండి రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలనీ ఈనెల 28న చలో విద్యుత్ సౌధా (హైదరాబాద్)ముందు చేపట్టే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకోవచ్చి మన డబ్బులు వసూలు చేసుకోవాలి. లాభాలు గడించిన సింగరేణి ఆర్థిక సంక్షభంలోకి వెళ్లే ప్రమాదం ఉంది.రోజు వారి నిర్వహణ, సంక్షేమము,జీతభత్యాలకు, స్పేర్ పాట్స్ కొనుగోలుకు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటుంది. కావున సంస్థ పరిరక్షణ, ఉద్యోగబద్రత కొరకు కార్మికసోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలి. సంస్థను,కార్మికులను నాటి ప్రభుత్వం,నేటి ప్రభుత్వం మోసం చేస్తూ దివాళా తీపిస్తున్నాయి.గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు బాధ్యత మరిచి సోద్యం చూస్తున్నాయని అన్నారు. కావున కార్మిక సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని ఆర్.జీ-త్రీ బ్రాంచి కార్యదర్శి దొమ్మటి కొమురయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఏమ్.వెంకటేశ్వర్లు, మల్లేష్,రాయమల్లు,రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారా? అయితే కాసిన్ని ఖర్జూరాలు తినండి..



ఏడాది పొడవునా మార్కెట్‌లో లభించే పండ్లలో ఖర్జూరం ఒకటి. వివిధ రకాల ఖర్జూరాలు మార్కెట్లో లభిస్తుంటాయి. అన్ని రకాల ఖర్జూరాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే వీటిని 'సూపర్ ఫుడ్' అని కూడా పిలుస్తారు. ప్రతిరోజూ ఖర్జూరం తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. రోజూ ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇక్కడ తెలుసుకుందాం. ఖర్జూరంలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం, కాపర్, మాంగనీస్, విటమిన్ బి6, కె అధికంగా ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే ఖర్జూరంలో పోషక విలువలు చాలా ఎక్కువ. ఖర్జూరం తినడం వల్ల ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి చక్కెరలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. శరీరానికి వెంటనే శక్తి అందుతుంది. అందుకే ఉపవాసం తర్వాత ఖర్జూరం తినడం మంచిది. ఖర్జూరం పొట్టకు చాలా మంచిది. ఖర్జూరాలు జీర్ణక్రియలో సహాయపడతాయి. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. పీచు పుష్కలంగా ఉండటం వల్ల మలబద్ధకం నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ఖర్జూరం గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఖర్జూరాలు హృదయనాళ వ్యవస్థకు చాలా మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే శక్తి కూడా ఖర్జూరాలకు అధికంగా ఉంటుంది. ఖర్జూరంలో చక్కెర ఉన్నప్పటికీ ఇవి రక్తంలో చక్కెరను పెంచవు. అయినప్పటికీ డయాబెటిస్ పేషెంట్లు వీటిని తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. ఖర్జూరాలు మెదడు ఆరోగ్యాన్ని పెంచడానికి, మెదడు పనితీరును పెంచడంలో సహాయపడతాయి.



# వీరికి సంజీవని ఈ పండు.. రోజూ ఒకటి తిన్నారంటే ఈ వ్యాధికి దీన్ని మించిన దివ్యౌషధం లేదు.!

రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి పండ్లు తినడం. కొన్ని పండ్లను తీసుకోవడం వల్ల సహజంగా మీ శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. అలాంటి వాటిలో అవకాడో ఒకటి. దీనిని బటర్ ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. ఈ పండు మన శరీరానికి చాలా పోషకాలను అందిస్తుంది. అవకాడోలో కూరగాయల మాదిరిగానే ఆరోగ్యకరమైన పదార్థాలు ఉంటాయి. ఇందులో కొవ్వు అధికంగా ఉన్నప్పటికీ, ఇది మీ శరీరాన్ని అదనపు కొవ్వు నుండి రక్షిస్తుంది.మీ శరీరం ఫోలిక్ యాసిడ్ వంటి విటమిన్లను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. కాబట్టి మీరు ఈ పండును పచ్చిగా తినవచ్చు. అవకాడో మీ శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడానికి సహాయపడుతుంది. ఇది కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను కూడా నియంత్రణలో ఉంచుతుంది. అవకాడోను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల స్ట్రోక్ లేదా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.అవకాడోలో ఉండే కొవ్వు ఆమ్లాలు, లైపేస్ ఎంజైమ్ శరీరంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. అవకాడోలో విటమిన్ బి, విటమిన్ కె, విటమిన్ ఇ, విటమిన్ సి పుష్కలంగా ఉన్నాయి. అవకాడోలో ఉండే పొటాషియం మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మీ రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అవకాడోలో ఉండే ఫైబర్ మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.



## కొబ్బరినీళ్లు తాగే అలవాటుందా..? ఈ సమస్యలున్న వారు అస్సలు తాగకూడదంట.. ఇక మీ ఇష్టం..

ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఈ తరుణంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం.. ముఖ్యంగా ఎండాకాలంలో చాలామంది డీహైడ్రేషన్ సమస్యతో బాధపడుతుంటారు. వాస్తవానికి.. శరీరంలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ నీటిశాతం తగ్గితే.. అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. బాడీ డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు కొబ్బరి నీరు అమృతంలా పనిచేస్తుంది.. వాస్తవానికి కొబ్బరి నీరు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఎందుకంటే ఇందులో విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, కాల్షియం, కాపర్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడతాయి.. కొబ్బరినీళ్లు ఎప్పుడు తాగినా తాగినా మంచిదే కానీ.. కొందరికి మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని పేర్కొంటున్నారు వైద్య నిపుణులు.. కొన్ని సమస్యలున్న వారు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. ఏ వ్యాధితో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదో ఇప్పుడు తెలుసుకోండి. కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉన్నవారు: కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. మధుమేహ రోగులు: మధుమేహ వ్యాధిగ్రస్తులు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఎందుకంటే దానిలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువ. అందుకే.. కొబ్బరినీళ్లు తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి వేగంగా పెరుగుతుంది. అలర్జీ: అలర్జీ బాధితులు కొబ్బరినీళ్లు తాగకూడదు. కొబ్బరి నీరు తాగితే చర్మంపై దురద, మంట, చర్మం ఎర్రబడడం వంటి అనేక సమస్యలను ఎదుర్కొవలసి ఉంటుంది. అధిక రక్తపోటు: అధిక రక్తపోటుతో బాధపడేవారు కూడా సాధ్యమైనంతమేరకు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. అయితే, వైద్యుల సలహా మేరకు మాత్రం కొబ్బరి నీళ్లు తాగవచ్చు.



## కప్పు కాఫీ.. తాగితే అమేజింగ్ అంతే.! వీళ్లు మాత్రం అస్సలు జోలికి వెళ్లొద్దు..



ప్రపంచవ్యాప్తంగా కాఫీ లవర్స్ చాలామందే ఉంటారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కొంతమందికి కాఫీ తాగనిదే రోజు గడవదు. అంతలా ఎడిక్ట్ అవుతారు. ఉదయాన్నే బెడ్ కాఫీ తాగితేనే గానీ తమ రోజు మొదలుపెట్టరు. అయితే కాఫీ లిమిట్‌గా తాగితే ఫర్వాలేదు. కాని అధిక మోతాదులో తీసుకుంటేనే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ఈ వ్యాధులు ఉన్నవారు కాఫీని అస్సలు తాగకూడదు. మీరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటే.. అస్సలు కాఫీ తాగొద్దు. కాఫీలో కెఫిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది మెదడు నరాలపై ప్రభావం చూపిస్తుంది. అలాగే రక్త ప్రసరణ కూడా మందగిస్తుంది. అధిక మొత్తంలో కెఫిన్ శరీరంలోకి చేరితే.. మైగ్రేన్ మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉంటుంది. మీకు హై-బీపీ ఉన్నట్లయితే.. కాఫీ తాగకండి. కాఫీ తాగడం వల్ల రక్తపోటు స్థాయి మరింతగా పెరుగుతుంది. దాని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అలాగే కాఫీ తాగడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. దీంతో బీపీలో హెచ్చుతగ్గులు ఉండొచ్చు. డయాబెటిక్ పేషెంట్లు కాఫీ తాగడం మానేయాలని చాలామంది ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కాఫీ తాగడం వల్ల డయాబెటిక్ రోగులకు అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. రక్తంలో చక్కెర స్థాయి అసమతుల్యంగా ఉన్నవారు కూడా కాఫీ తాగకూడదు. గర్భధారణ సమయంలో కాఫీ తాగడం మంచిది కాదు. కాఫీలో ఉండే కెఫిన్ శాతం మీ శరీరంలోని రక్త ప్రసరణను ప్రభావితం చేస్తుంది. దీని వల్ల కడుపులో పెరుగుతున్న పిండానికి రక్తం సరఫరాలో అసమతుల్యత ఏర్పడుతుంది. ఒకవేళ మీకు ఒత్తిడిని ఎదురుకుంటున్నట్లయితే.. కాఫీ గురించి అస్సలు ఆలోచించొద్దు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కాఫీని ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో కార్టిసోల్ హార్మోన్‌పై అధిక ప్రభావం పడుతుంది. ఇది ఒత్తిడిని మరింత ఎక్కువ చేస్తుంది. కాగా, ఈ వార్త కేవలం పలు అధ్యయనాలు, వైద్య నిపుణుల రీసెర్చ్ ఆర్టికల్స్ ఆధారంగా ప్రచురించింది మాత్రమే. మీరు ఏదైనా డైట్ ఫాలో కావాలన్నా.. డాక్టర్ సలహా కచ్చితంగా తీసుకోండి.

## మీ బుజ్జాయి కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే.. రోజుకొక్కసారి ఇలా చేయండి



మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో కన్ను ఒకటి. చూపు లేని లోకం అంధకారం అని పెద్దలు అందుకే అంటారు. కాబట్టి కంటి సంరక్షణ చాలా ముఖ్యం. ముఖ్యంగా నేటి డిజిటల్ యుగంలో పిల్లలు చిన్నప్పటి నుంచే ఫోన్ స్క్రీన్‌కు అలవాటు పడుతున్నారు. దీంతో పిల్లల కళ్ళు బాల్యం దశలోనే ప్రమాదంలో పడుతున్నాయి. కాబట్టి చిన్న వయసు నుంచే పిల్లల కళ్లకు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే వయసు పెరిగే కొద్దీ సమస్యలు మరింత తీవ్రతరం అవుతాయి. మీ కంటిపాప చూపును జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం ఆయుర్వేదాన్ని ఆశ్రయించవచ్చు. మంచి కంటి చూపుకు, కంటి సంరక్షణకు ఆయుర్వేద నివారణలు ఎంతో ఉపయోగపడతాయి. తర్పన్ అనేది ఒక రకమైన ఆయుర్వేద చికిత్స. ఇది కళ్ళను తేమగా ఉంచడానికి, దృష్టిని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది కంటి దురదను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. దీనిని ఎలా వినియోగించాలంటే.. నెయ్యిని కళ్లపై నెమ్మదిగా రాసి, ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కళ్లను కడగాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల కళ్లకు చాలా మంచిది. కళ్లలోకి చేరే రకరకాల దుమ్ము, కాలుష్య కారకాలను తొలగించి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. అయితే అధిక వేడి, చల్లటి నెయ్యిన కళ్లకు ఎప్పుడూ పూయకూడదు. అలాగే కళ్లపై ప్రత్యక్ష సూర్యకాంతి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల కళ్లలోకి యువి కిరణాలు నేరుగా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సూర్యుడి నుండి కళ్ళను రక్షించడం కూడా అవసరమే. నేటి యుగంలో పిల్లల ముందు టీవీ, ల్యాప్‌టాప్, మొబైల్ స్క్రీన్‌లు కనిపిస్తున్నాయి. వాటిని నివారించలేం. అయితే పిల్లలను స్క్రీన్‌కు దూరం ఉంచడం మీ చేతుల్లో పనే. ఇది మీ పాపాయి కళ్లను కొంత వరకు కాపాడుతుంది. ఆయుర్వేదం ప్రకారం సోంపు గింజలు తినడం కళ్ళకు ఎంతో మేలు జరుగుతుంది. సోంపు గింజలు నోటి దుర్వాసనను తొలగించడంలో కూడా ఉపయోగపడతాయి. కాబట్టి రోజూ భోజనం తిన్న తర్వాత సోపు తింటే కళ్లకు మేలు చేస్తుంది. అలాగే త్రిఫల, ఉసిరి కళ్లకు చాలా మేలు చేస్తుంది. త్రిఫల పొడి, ఉసిరి పొడి కలిపి మీ చిన్నారికి ఆహారంలో ఇవ్వవచ్చు. దానితో పాటు కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అలవాటు చేయాలి. విటమిన్ ఎ అధికంగా ఉండే ఆహారాన్ని పిల్లలకు తినిపిస్తే కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

## పోషకాల్లో తిరుగులేని పొద్దుతిరుగుడు.. తింటే అద్భుతమైన శక్తి



పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ సి, విటమిన్ ఇ, విటమిన్ బి6, ఫైబర్, ఐరన్, జింక్, కాపర్, ఫాస్పరస్ మరియు కాల్షియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ ఎముకలను బలోపేతం చేయడమే కాకుండా మీ జీర్ణవ్యవస్థను కూడా మెరుగుపరుచుకోవచ్చు. అలాగే, అవి డయాబెటిక్ రోగులకు ఔషధం లాంటివి. ఎందుకంటే వీటి సహాయంతో రక్తంలో చక్కెర స్థాయిని నిర్వహించడంలో సహాయపడతాయి. పొద్దుతిరుగుడు పువ్వుకు ఎంత అందం ఉంటుందో, దాని గింజల్లో అంత ఆరోగ్యం దాగివుందని నిపుణులు అంటున్నారు. పొద్దుతిరుగుడు విత్తనాలు ఆరోగ్యానికి వరం లాంటివి. ప్రతిరోజూ వాటిని తినడం వల్ల ఈ అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. నేటి అనారోగ్యకరమైన జీవనశైలిలో, ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యం. మీ ఆహారంలో పొద్దుతిరుగుడు విత్తనాలను చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ నుండి రక్తపోటు వరకు నియంత్రించవచ్చు. పొద్దుతిరుగుడులో డైటరీ ఫైబర్, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్ కూడా ఉంటాయి. ఇవి అనేక వ్యాధులలో గొప్ప ప్రయోజనాలను అందిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో అద్భుతమైన ఆరోగ్య నిధి దాగి ఉంది. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి ఆహారంలో కొన్ని గింజలను చేర్చుకోవడం చాలా మేలు చేస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను ఉపయోగించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యల నుండి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండే పొద్దుతిరుగుడు విత్తనాలను తీసుకోవడం ద్వారా, మీరు మలబద్ధకం సమస్య నుండి కూడా ఉపశమనం పొందవచ్చు. పొద్దుతిరుగుడు విత్తనాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి వాటిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, ఈ విత్తనాలను తీసుకోవడం ద్వారా మీరు చాలా వరకు ఉపశమనం పొందవచ్చు. పొద్దుతిరుగుడు గింజలు డయాబెటిక్ రోగులకు ఒక ఔషధం లాంటివి., ఎందుకంటే వాటిలో పాలీసాచురేటెడ్ కొవ్వు పుష్కలంగా ఉంటుంది. కార్బోహైడ్రేట్ పరిమాణం తక్కువగా ఉంటుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను తినడం వల్ల జీవక్రియ రేటు పెరుగుతుంది. వాటిలో మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో సన్‌ఫ్లవర్ సీడ్స్ రెగ్యులర్ వినియోగం బరువు తగ్గడానికి, స్థూలకాయాన్ని అదుపులోకి తీసుకురావడానికి సహాయపడుతుంది. ఎముకల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కూడా ఈ విత్తనాలు చాలా మేలు చేస్తాయి. మీరు కూడా కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఎందుకంటే ఇందులో కాల్షియం, మెగ్నీషియం, జింక్ మరియు ఇనుము మంచి మొత్తంలో ఉంటాయి. పొట్టను శుభ్రం చేయడంలో పొద్దుతిరుగుడు గింజలకు మరోకటి పోటీ లేదు. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, శరీరంలోని టాక్సిన్స్‌ను కూడా బయటకు పంపవచ్చు . ప్రతిరోజూ 2 టేబుల్ స్పూన్ల పొద్దుతిరుగుడు విత్తనాలు మీ ఆరోగ్యానికి వరం కంటే తక్కువ కాదు.

# స్పోర్ట్స్

# ధోనీ రాకతో సీఎస్‌కే దశ మారుతుందా?



ఐపీఎల్ 2026 సీజన్ మొదలై అప్పుడే చెన్నై సూపర్ కింగ్స్ 6 మ్యాచ్‌లు ఆడేసింది. కానీ కోట్లాది మంది అభిమానులు ఎదురుచూస్తున్న ఆ ఒక్క రూపం మాత్రం ఇంకా మైదానంలో కనిపించలేదు. తనే.. మన తలా ఎంఎస్ ధోనీ. అయితే, ముంబై ఇండియన్స్‌తో జరగబోయే కీలక పోరుకు ముందు ధోనీ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ధోనీ రీఎంట్రీ పై క్లారిటీ వచ్చేసింది. సాధారణంగా అయితే ఎంఎస్ ధోనీ నెట్స్‌లో వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేయడం చాలా అరుదు. ఆయన ఎక్కువగా బ్యాటింగ్ లేదా సరదాగా బౌలింగ్ చేస్తూ కనిపిస్తారు. కానీ, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు ధోనీ వికెట్ కీపింగ్ గ్లోవ్స్ ధరించి ప్రాక్టీస్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబై మాజీ ప్లేయర్ ఆదిత్య తారే దీని మీద స్పందిస్తూ.. "నేను ధోనీని నెట్స్‌లో కీపింగ్ చేయడం ఎప్పుడూ చూడలేదు. ఇది నిజంగా షాకింగ్. బహుశా ఆయన తన మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరీక్షించుకుంటున్నట్లు ఉన్నారు." అని పేర్కొన్నారు. ఇది సీఎస్‌కే శిబిరంలో గుడ్ సిగ్నల్స్ పంపుతోంది. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే ధోనీ కాఫ్ ఇంజూరీ (పిక్క గాయం) బారిన పడ్డారు. దీనివల్ల సీజన్ లో మొదటి 6 మ్యాచ్‌లకు ఆయన దూరమయ్యారు. ధోనీ లేకపోవడం వల్ల చెన్నై జట్టు 6 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి, నాలుగింటిలో ఓడిపోయింది. జట్టులో గేమ్ అవేర్‌నెస్ లోపించిందని, క్లిష్ట సమయాల్లో ధోనీ వంటి సీనియర్ అవసరం ఎంతైనా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు ఆయన ప్రాక్టీస్ మొదలుపెట్టడంతో, ఏప్రిల్ 23న ముంబైతో జరిగే మ్యాచ్‌లో ఆయన బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గడిచిన రెండు సీజన్లలో ధోనీ లోయర్ ఆర్డర్ (నంబర్ 7 లేదా 8)లో వచ్చి మెరుపులు మెరిపించారు. 2024 ఐపీఎల్‌లో 161 పరుగులు చేసిన ఆయన, 2025 సీజన్‌లో 14 మ్యాచ్‌లలో 196 పరుగులు సాధించారు. స్ట్రైక్ రేట్ విషయంలో యువకుల కంటే బెటర్ గా ఉండటం ఆయన ప్రత్యేకత. ఈ ఏడాది కూడా అదే దూకుడును కొనసాగించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ముఖ్యంగా ముంబై ఇండియన్స్‌పై ధోనీకి మంచి రికార్డు ఉండటం ప్లస్ పాయింట్.ఐపీఎల్‌లో ముంబై, చెన్నై మ్యాచ్ అంటేనే ఒక ఎల్ క్లాసికో. ఇరు జట్లు చెరో ఐదుసార్లు టైటిల్ గెలిచాయి. ప్రస్తుత పాయింట్ల పట్టికలో చెన్నై వెనుకబడి ఉన్న తరుణంలో, ధోనీ రాక జట్టులో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో ధోనీ సలహాలు జట్టుకు కొండంత బలాన్ని ఇస్తాయి. రేపటి మ్యాచ్‌లో ధోనీ టాస్ సమయానికి జట్టులో ఉంటారా లేదా అన్నదే ఇప్పుడు బిలియన్ డాలర్ల ప్రశ్న.

## నికోలస్ పూరన్ ఎంపికకు అనుభవమే ప్రధాన కారణం

లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్
పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నా.. నికోలస్ పూరన్‌ను ఆడించడానికి అతని అనుభవమే ప్రధాన కారణమని లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ తెలిపాడు. వరుస వైఫల్యాల నేపథ్యంలో తుది జట్టులో మార్పులు చేసినా నికోలస్ పూరన్‌ను పక్కన పెట్టలేమని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచిన లక్నో సూపర్ జెయింట్స్ బౌలింగ్ ఎంచుకుంది.పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని రిషభ్ పంత్ తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకుంటున్నాం. గతం గురించి పట్టించుకోకుండా ప్రస్తుత మ్యాచ్‌పైనే ఫోకస్ పెట్టాలనుకుంటున్నాం. ముందుగా బౌలింగ్ చేసి రాజస్థాన్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని అనుకుంటున్నాం.లక్నోలో పిచ్ కండిషన్స్ సవాల్‌గా ఉన్నాయి. ఈ ఛాలెంజ్‌ను మేం ఇష్టపడుతున్నాం. మా సొంతగడ్డపై ఎలా ఆడాలో మేం ఒక మార్గాన్ని కనుగొంటాం. వరుస వైఫల్యాల నేపథ్యంలో తుది జట్టులో స్వల్ప మార్పులు చేశాం. జట్టు స్థిరత్వం దెబ్బతినకుండా ఈ మార్పులు చేశాం. మా బౌలింగ్ విభాగంలో రెండు మార్పులు జరిగాయి.. సిద్ధార్థ్ స్థానంలో దిగ్వేష్ రతి, ఆవేష్ స్థానంలో మయాంక్ యాదవ్ జట్టులోకి వచ్చారు. నికోలస్ పూరన్‌ను తుది జట్టు నుంచి తప్పించలేం. అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన ఆటగాడిని ఎలా ఆడినా నమ్మాలి. మా జట్టుకు అతను చాలా ముఖ్యం. నికోలస్ పూరన్ పట్ల మాకున్న ప్రేమ, కేర్ అలాంటిది.'అని రిషభ్ పంత్ తెలిపాడు. మరోవైపు టాస్ ఓడిపోవాలని కోరుకున్నానని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ అన్నాడు. ఈ పిచ్ కండిషన్స్ నేపథ్యంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే అయోమయంలో ఉన్నానని చెప్పాడు. టాస్ ఓడిపోయినందుకు సంతోషంగా ఉందన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ ఎదైనా చేయడానికి తాను సిద్ధమేనని తెలిపాడు. 'ఇక్కడ కొన్ని దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లు ఆడాం. రెండో ఇన్నింగ్స్ సమయంలో పిచ్ కొంచెం నెమ్మదించవచ్చు.గత మ్యాచ్‌లో కోల్‌కతాపై మేము బాగానే బ్యాటింగ్ చేశాం. కానీ మిడిల్ ఓవర్లలో కొన్ని లెక్కలు తప్పాయి. అయితే జైస్వాల్, వైభవ్ బ్యాటింగ్ చేసిన తీరు అద్భుతం. ఆ మ్యాచ్ కొన్ని తప్పులు జరిగాయి. మనం గెలవాలంటే 40 ఓవర్ల పాటు అత్యుత్తమ క్రికెట్ ఆడాలని మా ఆటగాళ్లకు చెప్పాను. ఈ రాత్రి అది చేస్తామని ఆశిస్తున్నాను. మేం అదే జట్టుతో బరిలోకి దిగుతున్నాం'అని రియాన్ పరాగ్ తెలిపాడు.





## యువ పేసర్‌కు హగ్ ఇచ్చిన కావ్య మారన్?

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్, ఆ జట్టు యువ పేసర్ ప్రఫుల్ హింగేకు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ప్రఫుల్ హింగేను కావ్య మారన్ హగ్ చేసుకున్నట్లుగా ఉన్న ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చనీయాంశమైంది. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ప్రఫుల్ హింగే మూడు వికెట్లు తీసి ఈ ఫీట్ సాధించిన తొలి బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్‌తో ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన ప్రఫుల్ హింగే.. 4 వికెట్లతో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో తన రెండో మ్యాచ్‌లో వికెట్ తీయకపోయినా.. ఆఖరి ఓవర్‌లో కట్టడిగా బౌలింగ్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. టీమ్ కాంబినేషన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో గత మ్యాచ్‌కు ప్రఫుల్ హింగే బెంచ్‌కే పరిమితమయ్యాడు. అయితే ఈ యువ పేసర్ ప్రదర్శనకు ఫిదా అయిన కావ్య మారన్.. ఈ కుర్రాడిని హగ్ చేసుకున్నట్లు కొందరు ఆకతాయిలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఫేక్ వీడియోను సృష్టించారు. ఈ వీడియోలో ప్రఫుల్ హింగేతో పాటు మరో యువ పేసర్ సాకిబ్ హుస్సేన్‌ను కావ్య మారన్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఉంది. అయితే ఈ వీడియోను చూస్తేనే ఇది ఏఐతో తయారు చేసిందనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది. అయితే




ఇది తెలియని కొందరు అభిమానులు నిజమేనని భావించి.. వైరల్ చేస్తున్నారు. 'కుర్రాళ్ల ప్రతిభకు ఫిదా అయిన కావ్య మారన్ వారిని హగ్ చేసుకొని ప్రశంసించింది. ఆమె హగ్‌తో కుర్రాళ్లు సంతోషానికి గురయ్యారు.'అనే క్యాప్షన్స్ రాసుకొస్తున్నారు. అయితే ఈ వీడియోలో ఎలాంటి నిజం లేదు.కావ్య మారన్ ఎప్పుడూ మైదానంలోకి రారు. ఆటగాళ్లతో కూడా చాలా తక్కువగా మాట్లాడుతారు. ఐపీఎల్ 2024 ఫైనల్ ఓటమి అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి కావ్య మారన్ తొలిసారి వచ్చారు. ఓటమి బాధలో ఉన్న ఆటగాళ్లను ఓదార్చారు. అంతే తప్పా ఎప్పుడూ ఆమె మైదానంలో అడుగుపెట్టలేదు. గ్యాలరీలోనే సందడి చేసి అక్కడి నుంచే వెళ్లిపోతారు. కావ్యమారన్‌పై డీప్ ఫీక్ వీడియోలు సృష్టించడం ఇదే తొలిసారి కాదు. గతంలో జై షా, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లతో సన్నిహితంగా ఉన్నట్లు ఫేక్ వీడియోలను సృష్టించి వైరల్ చేశారు.



## దిల్షాన్ మదుశంక ఐపీఎల్ అరంగేట్రం

సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతూ దిల్షాన్ మదుశంక మంగళవారం (ఏప్రిల్ 21న) ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. అతను తన దేశం శ్రీలంకకు చెందిన పథుమ్ నిస్సంకను అవుట్ చేయడం ద్వారా తన మొదటి ×ఐపీఎల్ వికెట్‌ను సాధించాడు. మదుశంక 4 ఓవర్లలో 36 పరుగులు ఇచ్చి 1 వికెట్ తీశాడు. 2023లో భారత్‌తో జరిగిన ఒక మ్యాచ్‌లో ఏకంగా 5 వికెట్లు పడగొట్టాడు. అందులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వికెట్లు కూడా ఉన్నాయి.దిల్షాన్ మదుశంకను సన్‌రైజర్స్ హైదరాబాద్ నేరుగా వేలంలో కొనుగోలు చేయలేదు. కానీ అతను రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా జట్టులోకి వచ్చాడు. విదేశీ ఆటగాడు బ్రైడన్ కార్స్ స్థానంలో రూ. 75 లక్షల మొత్తంతో మదుశంక సన్‌రైజర్స్ లో చేరాడు. అంతకుముందు అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన కారణంగా ముంబై ఇండియన్స్ గతంలో కొనుగోలు చేసింది. 2024లో ముంబై మదుశంకను రూ. 4.60 కోట్లకు కొనుగోలు చేసింది. గాయం కారణంగా మదుశంక ఆ ఏడాది ఐపీఎల్ అరంగేట్రం చేయకుండానే తప్పుకున్నాడు. దిల్షాన్ మదుశంక ( 2000 జనవరి 18న శ్రీలంకలోని హంబన్‌తోట నగరంలో జన్మించాడు. లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ అయిన మదుశంక శ్రీలంక జట్టు తరపున 2022లో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. మదుశంక 2022లో తన మొదటి టీ20 అంతర్జాతీయ మ్యాచ్ సైతం ఆడాడు. 2023 జనవరి 10న వన్డేల్లో అరంగేట్రం చేసే అవకాశం లభించింది. అతని మొదటి మ్యాచ్ టీమ్ ఇండియాతో జరిగింది. ఇందులో ఒక వికెట్ తీశాడు. అయితే ఇప్పటి వరకు మదుశంక అత్యుత్తమ స్పెల్ భారత్‌పైనే నమోదైంది. లంక పేసర్ దిల్షాన్ మదుశంక 28 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. ఒకసారి ఐదు వికెట్ల ఘనత సాధించాడు. అతని ఈ స్పెల్ భారత్‌తోనే టీమిండియాపై జరిగింది. 2023 నవంబర్ 2న వాంఖడేలో జరిగిన ఈ మ్యాచ్‌లో లంక పేసర్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్ తో పాటు శ్రేయస్ అయ్యర్ వంటి దిగ్గజ బ్యాటర్లను అవుట్ చేసి 5 వికెట్ల హాల్ సాధించాడు. ఈ ఐదుగురు మ్యాచ్ విన్నర్లు కావడంతో మదుశంకతో మంచి గుర్తింపు లభించింది. మదుశంక తన కెరీర్‌లో లంక తరఫున 1 టెస్ట్, 28 వన్డేలు, 19 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. వన్డేల్లో 50 వికెట్లు, టీ20ల్లో 20 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ కాకుండా మదుశంక పాకిస్థాన్ సూపర్ లీగ్ ), ఇంటర్నేషనల్ లీగ్ టీ20, లంక ప్రీమియర్ లీగ్‌లలో ఆడాడు. 17 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లాడిన మదుశంక 47 వికెట్లు తీశాడు. లిస్ట్ ఏ లోని 50 మ్యాచ్‌ల్లో అతని ఖాతాలో 92 వికెట్లు ఉన్నాయి. లీగ్, అంతర్జాతీయ మ్యాచ్‌లు కలిపి అతను మొత్తం 64 టీ20 మ్యాచ్‌లాడగా 62 వికెట్లు తీశాడు. ఏప్రిల్ 21న ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచులో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. అతడు మొదట ప్లేయింగ్ 11లో లేడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మొదట బ్యాటింగ్ కు దిగి నిర్ణీత ఓవరల్లో 242 పరుగుల భారీ స్కోరు చేసింది. బౌలింగ్ సమయంలో ట్రావిస్ హెడ్ స్థానంలో దిల్షాన్ మదుశంకను ఇంపాక్ట్ ప్లేయర్‌గా సన్‌రైజర్స్ బరిలోకి దించింది.

## సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న రబాడ వీడియో


ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతున్న వేళ, మైదానంలో ఆటగాళ్ల మెరుపుల కంటే బయట వారు చేస్తున్న పనులు ఇప్పుడు హాట్ టాపిక్ అవుతున్నాయి. ముఖ్యంగా స్టార్ క్రికెటర్లు బహిరంగంగా సిగరెట్లు తాగుతూ దొరికిపోవడం క్రీడా వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇటీవల స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ సిగరెట్ తాగుతూ కనిపించగా, ఇప్పుడు సౌతాఫ్రికా స్పీడ్‌స్టర్ కాగిసో రబాడ వంతు వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడుతున్న సౌతాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కాగిసో రబాడ, ఒక చోట కూర్చుని దర్జాగా సిగరెట్ తాగుతున్న వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. ఈ వీడియో ఎక్కడిది అనే దానిపై క్లారిటీ లేనప్పటికీ, ఇది ఏదో ఒక హోటల్ లేదా స్టేడియంలోని ప్లేయర్స్ ఏరియాలో తీసినట్లు కనిపిస్తోంది. ఫిట్‌నెస్ మీద అత్యంత శ్రద్ధ చూపే అథ్లెట్లు ఇలా బహిరంగంగా ధూమపానం చేయడం పట్ల నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కొద్దిరోజుల క్రితమే పంజాబ్ కింగ్స్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కూడా ఇలాంటి వివాదంలోనే చిక్కుకున్నాడు. తన లగ్జరీ బీఎండబ్ల్యూ కారును నడుపుతూ, కారు కిటికీలో నుంచి వెలుగుతున్న సిగరెట్‌ను బయటకు విసిరేస్తూ చాహల్ కెమెరాకు దొరికిపోయాడు.

# సోదరుడితో విభేదాలపై కృనాల్ రియాక్షన్



ఐపీఎల్?లో పాండ్య బ్రదర్స్ (కృనాల్– హార్దిక్) సందడి అంతా ఇంతా కాదు. ఈ సోదరులు ఇద్దరు తమ ప్రదర్శనతో ఈ లీగ్?లో ఉత్తమ ప్లేయర్లుగా ఎదిగారు. కెరీర్ తొలినాళ్లలో ఈ ఇద్దరూ ముంబయి ఇండియన్స్?కే ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత ఒక్కరు ఒక్కో టీమ్?కు ఆడుతున్నారు. అయితే ప్రత్యర్థులుగా బరిలోకి దిగినప్పటికీ పాండ్య బ్రదర్స్ స్పోర్ట్స్ స్పిరిట్ మెచ్చుకునేలా ఉంటుంది. మైదానం బయట కూడా వీళ్లద్దరూ ఇంకా ప్రేమగా ఉండేవారు. అయితే ఈ ఇద్దరి మధ్య విభేదాలు వచ్చినట్లు ఇటీవల ప్రచారం సాగుతోంది. మరోవైపు, కొంతకాలంగా ఈ ఇద్దరూ మునుపటిలా క్లోజ్?గా కూడా ఉండడం లేదు. కొన్ని నెలలుగా ఒకే ఫ్రేమ్?లో పాండ్య బ్రదర్స్ అసలు కనిపించింది లేదు. కనీసం సోషల్ మీడియాలోనైనా ఒకరినొకరు పలకరించుకున్నదీ లేదు. అయితే రీసెంట్?గా ముంబయి ఇండియన్స్–రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో కృనాల్ ఆర్సీబీకి, హార్దిక్ ముంబయికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ ఇద్దరు ఎదురుపడ్డప్పుడు మాట్లాడుకుంటారేమో అని అభిమానులు ఎదురుచూశారు. కెమెరాలు కూడా వీళ్లిద్దర్నీ ఫోకస్ చేశాయి. కానీ మ్యాచ్ సందర్భంగా ఎదురుపడినప్పటికీ పాండ్య బ్రదర్ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. దీంతో అన్నదమ్ముళ్ల మధ్య విభేదాలు నిజమేనని అంతా అనుకుంటున్నారు! అయితే తమ సోదరుల మధ్య అంతా సవ్యంగా లేదన్న వార్తలపై కృనాల్ స్పష్టతనిచ్చాడు. తాజాగా అతడు ఆర్సీబీ ఇన్?సైడర్స్ మిస్టర్ నాగ్స్? ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఇందులో 'గతేడాది నువ్వు నా షోకు రాలేదు. అప్పుడు నేను ఫోన్ చేస్తే నువ్వు ఫ్యామిలో బిజీగా ఉన్నానని చెప్పావు. అంటే ఆర్సీబీ నీ ఫ్యామిలీ కాదా?' అని అడిగాడు. దీనికి కృనాల్ 'ఆర్సీబీ కూడా నా ఫ్యామిలీనే. నేను చెప్పాను కానీ నువ్వు సరిగ్గా విననట్లు ఉన్నావు. అయితే ఇంట్లో అనేకమంది ఫ్యామిలీ మెంబర్స్ ఉంటారు. కానీ ఒక్కోసారి ఒకరిని మిస్ అవుతాము' అని అన్నాడు. దీనికి నాగ్స్ వెంటనే 'మీ సోదరుడి లాగానే' అని అన్నాడు. దీనికి కృనాల్ నవ్వేశాడు.ఈ క్రమంలోనే తమ బ్రదర్స్ మధ్య అంతా సవ్యంగానే ఉందా? అని కృనాల్?ను నాగ్స్ అడిగాడు. ?"మీ ఇద్దరి మధ్య అంతా బాగానే ఉందా? లేదా ఏమైనా గొడవలు జరుగుతున్నాయా?" అని అడగ్గా, కృనాల్ ఒక్కసారిగా నవ్వేశాడు. అప్పుడు హోస్ట్ "కేన్, అండర్‌టేకర్ కూడా కొన్నిసార్లు గొడవ పడతారు అది కామనే" (రెజ్లర్లను ఉద్దేశించి) అని వ్యాఖ్యానించాడు. దీనికి "అంతా బాగానే ఉంది" అని కృనాల్ నవ్వుతూ బదులిచ్చాడు. దీంతో అన్మదమ్ముళ్ల మధ్య గొడవలు అన్న ప్రచారానికి ఫుల్? స్టాప్ పడినట్లే అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# షుగర్ పేషెంట్స్ ఎంత సేపు నడవాలి





**- ఈ జాగ్రత్తలు తప్పనిసరి..!!**

మధుమేహం. ఒక్క సారి వచ్చిందంటే జీవితాంతం జాగ్రత్తగా ఉండాల్సిందే. ప్రస్తుత కాలంలో మధు మేహ వ్యాధి గ్రస్తుల సంఖ్య పెరగటానికి అనేక కారణాలు ఉన్నాయి. సక్రమమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లు పాటిస్తే డయాబెటిస్ ముప్పు తగ్గుతుందని నిపుణులు సూచిస్తున్నారు. అందు లో భాగంగా ముఖ్యంగా రోజూ వాకింగ్ చేస్తే డయాబెటిస్?తో బాధపడుతున్న వారికి ఎంతో మేలు జరుగుతుందని స్పష్టం చేస్తున్నారు. అయితే, మధుమేహం ఉన్న వారు ఎంత సేపు నడవాలి .. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దాని పైన నిపుణులు కీలక సూచనలు చేస్తున్నారు. రక్తంలో షుగర్ లెవల్స్ అదుపులో ఉంచటం లో నడక సహకరిస్తుంది. డయాబెటిస్ బాధితులు రోజుకు కనీసం 30 నిమిషాలు నడిస్తే మంచిదని నిపుణులు చెబుతున్నారు. వారంలో 5 రోజులు, రోజుకి 30 నిమిషాలు వాకింగ్ చేస్తే మేలని పరిశోధనలు వెల్లడించాయి. అదే విధంగా క్రమం తప్ పకుండా ఏరోబిక్ వ్యాయామం చేయడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయని అధ్యయనం లో తేలింది. శరీరంలో ఒత్తిడిని పెంచే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తి పెరిగితే రక్తంలో షుగర్ లెవల్స్ పెరుగుతాయి. యోగా, ధ్యానం, వ్యాయామం లాంటివి చేయాలని సూచిస్తున్నారు. ఎవరికైనా శారీరక శ్రమ అవసరమని, అందుకోసం క్రమం తప్పకుండా వాకింగ్ చేయాలని చెబుతున్నారు. ఫలితంగా రక్తంలో షుగర్ స్థాయిలు అదుపులో వస్తాయని వివరిస్తున్నారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ .. లంచ్.. డిన్నర్ తరువాత కనీసం పది నిమిషాలు నడిస్తే రక్తంలో షుగర్ లెవల్స్ అదుపులోకి వస్తాయని వెల్లడిస్తున్నారు. వాకింగ్ చేసేటప్పుడు గంటకు మూడు నుంచి నాలుగు మైళ్ల మితమైన వేగంతో నడిస్తే ఇన్సులిన్ స్థాయిలు పెరగడంతోపాటు గుండె సంబంధిత సమస్యలు అదుపులో ఉంటాయి. అయితే, వాకింగ్ వేళ పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జాయింట్లపై ఒత్తిడి పడకుండా ఉండాలంటే సమాంతరంగా ఉన్న నేలపై నడక కొనసాగించాలని చెబుతున్నారు. ఆ తర్వాత మెట్లు ఎక్కడం, దిగడం చేయాలని తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు ఉదయం లేదా సాయం త్రం వేళల్లో వాకింగ్?కు ప్రత్యేక సమయం కేటాయించుకోవాలి. వాకింగ్ చేయడం వల్ల రక్త ప్రసరణ పెరిగి చర్మానికి ఆక్సిజన్, పోషకాలు సరిగ్గా అందుతాయని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ముఖంలో నీరసం పోయి సహజ కాంతితో ఉండేలా చేస్తుందని వెల్లడిస్తున్నారు.



# బ్రేక్‌ఫాస్ట్‌ను బ్రేక్ చేస్తున్నారా?

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మిస్ చేస్తున్నారా? అయితే, మీ మానసిక ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉన్నదట. 'అల్పాహారం–మానసిక ఆరోగ్యం'పై చేసిన ఓ సర్వే.. ఈ విషయాలను వెల్లడిస్తున్నది. 'హాంకాంగ్ యూత్ ఎపిడెమియోలాజికల్ స్టడీ ఆఫ్ మెంటల్ హెల్త్' పరిశోధకులు ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందుకోసం 15 నుంచి 24 ఏళ్ల వయసుగల 3,154 మందిని ఎంపిక చేశారు. వీరి రోజూవారి ఆహార అలవాట్లను పరిశీలించారు. ప్రతిరోజూ ఉదయం ఏదో ఒకటి తిన్నవారితో పోలిస్తే.. అల్పాహారం దాటవేసినవారు ఎక్కువ ఉద్రేకంతో, ఆందోళనతో, నిరాశతో కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు. అధ్యయనంలో పాల్గొన్న వారిలో 85% మంది ప్రతిరోజూ లేదా అడపాదడపా ఏదో ఒక అల్పాహారం తీసుకున్నారు. మిగిలిన 15% మంది బ్రేక్‌ఫాస్ట్‌ను పూర్తిగా దాటవేశారు. ఈ సందర్భంగా అల్పాహారం తీసుకోని వారిలో శ్రద్ధ తగ్గిపోవడం, స్వీయ నియంత్రణను కోల్పోవడం లాంటి సమస్యలను గుర్తించినట్లు అధ్యయనకారులు చెబుతున్నారు. ఇక అల్పాహారం దాటవేసేవారు తక్కువ ఉత్పాదకత కలిగి ఉన్నారని, పేలవమైన పనితీరును కనబర్చినట్లు గుర్తించారు. ఉద్యోగాలలోనూ తక్కువ సామర్థ్యం కలిగి ఉన్నారని నివేదించారు. బ్రేక్‌ఫాస్ట్‌ను దాటవేయడం వల్ల మధ్యాహ్నం వరకే నిస్సత్తువ ఆవహిస్తుందనీ, దాంతో దేనిమీదా శ్రద్ధ పుట్టదని చెబుతున్నారు. అందుకే, ఏ రకమైన ఆహారం, ఎంత పరిమాణంలో తింటారనే విషయాలతో సంబంధం లేకుండా.. ఉదయంపూట ఏదో ఒకటి తినడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక అల్పాహారం వల్ల మానసిక ఆరోగ్య ప్రయోజనాలతోపాటు శారీరక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత.. మధ్యాహ్నంపూట తక్కువ కేలరీలు తీసుకుంటారు. దాంతో బరువు అదుపులో ఉంటుంది. రక్తంలోనూ చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.

# స్టీల్ డబ్బాల్లో వద్దు..



ప్లాస్టిక్ డబ్బాల వినియోగం ఆరోగ్యానికి హానికరం. అందుకే, ఆహార పదార్థాల నిల్వకోసం స్టీల్ పాత్రలనే ఎక్కువగా వాడుతున్నారు. కానీ, కొన్ని పదార్థాలు స్టీల్‌తో రసాయన చర్య జరుపుతాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటిని స్టీల్ పాత్రల్లో స్టోర్ చేయొద్దని సూచిస్తున్నారు. టమాటాల్లోని సహజ ఆమ్లాలు.. ఉక్కుతో చర్య జరుపుతాయి. దాంతో, ఆహార పదార్థాల రుచితోపాటు పోషకాలు కూడా దెబ్బతింటాయి. కాబట్టి, టమాటా వంటకాలను స్టీల్ డబ్బాల్లో నిల్వ చేయకపోవడమే మంచిది. సిరామిక్ బౌల్, గాజు కంటెయినర్లు వాడుకోవచ్చు. అసిడిక్ లక్షణాలు ఉండే పచ్చళ్లను కూడా స్టీల్ డబ్బాలకు దూరంగా ఉంచాలి. మామిడి, నిమ్మ, ఉసిరి, చింతపండులో ఉండే ఆమ్ల లక్షణాలు.. దీర్ఘకాలంలో స్టీల్‌తో రసాయన చర్య జరుపుతాయి. ఫలితంగా పచ్చళ్ల రుచి మారడంతోపాటు ఓ రకమైన మెటాలిక్ టేస్ట్ కూడా వస్తుంది. పచ్చళ్లు కూడా త్వరగా పాడవుతాయి. అందుకే, పచ్చళ్లకు స్టీల్ డబ్బాల కన్నా.. గాజు పాత్రలు, సిరామిక్ జాడీలే మంచివి. ఇక కట్ చేసిన పండ్లు, ఫ్రూట్ సలాడ్ వంటివి కూడా.. స్టీల్ గిన్నెల్లో పెట్టడం మంచిది కాదట. వాటిని ఎక్కువ సమయంపాటు స్టీల్ కంటెయినర్లలో ఉంచితే.. నీటిశాతం పెరుగుతుంది. రుచి కూడా దెబ్బతింటుంది. బదులుగా.. గాజు పాత్రల్లో ఉంచితే ఫ్రెష్‌గా ఉంటాయి. సిట్రస్ జాతికి, స్టీల్‌కు పడనే పడదు. అందుకే, నిమ్మపండ్లతో చేసే లెమన్ రైస్, లెమన్ జ్యూస్ కూడా స్టీల్ డబ్బాల్లో స్టోర్ చేయొద్దు. మామిడికాయలు, చింతపండుతో తయారైన పదార్థాలను స్టీల్ డబ్బాలో నిల్వ చేసినా.. వాటి రుచి తగ్గుతుంది. ఇక పెరుగులోనూ సహజసిద్ధమైన ఆమ్ల లక్షణాలు ఉంటాయి. కాబట్టి, పెరుగును స్టీల్ డబ్బాల్లో ఎక్కువ సమయంపాటు పెడితే.. దాని రుచితోపాటు టెక్చర్ కూడా మారుతుంది. పెరుగును సిరామిక్, గాజు పాత్రల్లో నిల్వ చేయడమే ఉత్తమం.

# ఇల్లంటే ఓ ఎమోషన్!



కొందరికి ఇల్లు అంటే స్టేటస్ సింబల్‌గా భావిస్తారు. రిచ్‌గా కనిపించాలని అనుకుంటారు. నటి అదితి రావ్ హైదరీ మాత్రం ఇల్లంటే నాలుగు గోడల నిర్మాణం కాదనీ, ఓ ఎమోషన్ అని చెబుతున్నది. అభిరుచికి తగ్గట్టు, చిన్ననాటి జ్ఞాపకాలతో తన నివాసాన్ని ఓ అందమైన గూడుగా మార్చుకుందామె! 'నేను పనిచేసేది పొగడ్తల ప్రపంచంలో.. కానీ, నాకు నిజమైన కాంప్లిమెంట్ ఏంటో తెలుసా? ఎవరైనా నా ఇంటికి వచ్చినప్పుడు వాళ్లు చాలా కంఫర్ట్ ఫీల్ అవ్వాలి. వాళ్ల ఇల్లే అన్నట్టుగా భావించాలి! అదే నాకు ఎక్కువ సంతృప్తినిస్తుంది' అని చెప్పుకొచ్చింది అదితి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన ఇంటి గురించి చెబుతూ.. 'మీరు నమ్మరు!! చిన్నప్పుడు నాన్న నాకు ఒక అద్భుతమైన బొమ్మల ఇల్లు తయారు చేసిచ్చారు. అందులోనే బెడ్‌రూమ్‌లు, మంచాలు, చిన్న చిన్న మనుషుల బొమ్మలు, ఇంటి చుట్టూ లైట్లు, మెలికలు తిరిగిన మెట్లు ఇలా భలేగా ఉండేది. నేను ఈ ఇంటికి వచ్చినప్పుడు.. నా బొమ్మల ఇల్లే అనిపించింది' అని తన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంది. 'నాకు వెంటిలేషన్ అంటే చాలా ఇష్టం. హాల్‌లో కిటికీ పక్కన కూర్చుని, అలా ఎక్కడికో చూస్తూ ఆలోచనల్లో ఉండిపోతాను. మా ఇల్లు కాస్త చిన్నదే! కానీ, చాలా సౌకర్యంగా ఉంటుంది. ముంబయి లాంటి నగరంలో చిన్న ఓపెన్ స్పేస్ ఉండటం ప్రత్యేకమే! మనం కోరుకున్న ఇంట్లో ఉన్నప్పుడు.. అనుకున్న డెస్టినీకి చేరుకున్న ఫీలింగ్ కలుగుతుంది. మనల్ని మనమే కొత్తగా కనుక్కున్నట్టు అనిపిస్తుంది. నావరకైతే ఇల్లంటే ఓ నిర్మాణం కాదు.. భావోద్వేగం' అని ఇంటితో ఉన్న బంధాన్ని పంచుకుంది అదితి.

# టీసీఎస్‌లో భయం.. భయం..

**కొత్త పాలసీతో ఎంప్లాయీస్‌లో గుబులు**

**ముగిసిన 35 రోజుల బెంచ్ పాలసీ డెడ్‌లైన్**

**లేఆఫ్‌లు, డిమోషన్లపై పెరుగుతున్న ఆందోళన**

**కేంద్రం జోక్యానికి ఉద్యోగ సంఘాల లేఖ**



ఆడుతూ పాడుతూ పని, ఆకర్షణీయ వేతనాలు, విలాసవంతమైన జీవితం. ఇదీ.. ఐటీ రంగంలో కొలువుల తీరు. అయితే నిన్నమొన్నటిదాకా ఇలా ఉండచ్చేమోగానీ.. ఇప్పుడు మాత్రం సీన్ రివర్సైంది. కొరవడిన ఉద్యోగ భద్రత, జీతాల్లో కోతలు, ఒత్తిడితో కూడిన జీవనం. ఇదీ.. ఐటీ రంగ ఉద్యోగుల ప్రస్తుత పరిస్థితి. సాంకేతిక మార్పులు, పెరుగుతున్న పోటీ, పడిపోతున్న ఆదాయం ఇలా.. ఎన్నెన్నో అంశాలు ఐటీ కంపెనీలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే టీసీఎస్ ఓ కొత్త పాలసీని తీసుకొచ్చింది. ఇప్పుడిది అటు ఉద్యోగుల్లో, ఇటు పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. న్యూఢిల్లీ దేశీయ ఐటీ రంగ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తెచ్చిన కొత్త పాలసీ ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. గత నెల జూన్ 12న అమల్లోకి వచ్చిన ఈ విధానంలో 35 రోజుల బెంచ్ పాలసీ డెడ్‌లైన్ తాజాగా ముగిసింది. దీంతో సంస్థ ఉద్యోగులకు గుబులు పట్టుకుంటున్నది. వేలాది ఉద్యోగులు తమ భవిష్యత్తుపై అనిశ్చితిని చూడాల్సి వస్తున్నది మరి. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అన్ని విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ పాలసీ వర్తిస్తుండటం గమనార్హం. ఏమిటీ కొత్త పాలసీ? ఏ ప్రాజెక్టులో భాగస్వామి కాకుండా ఏడాదిలో గరిష్ఠంగా 35 రోజుల కంటే ఎక్కువ రోజులు సంస్థలో పనిచేసే ఏ ఉద్యోగి ఉండరాదు. అలా ఉన్నెట్లైతే వారి ఉద్యోగం రిస్క్‌లో పడ్డట్టే. ఫ్రెషర్లైతే ఉద్యోగాల్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అలాగే పైస్థాయి ఉద్యోగులైతే కిందిస్థాయికి దిగజారే వీలున్నది. సీనియర్ ఉద్యోగులకు పదోన్నతులు దక్కకపోవచ్చు. వేతనాలు, ఇతర అలవెన్సుల్లో కోతలుపడే అవకాశాలూ లేకపోలేదు. ఇక ఏడాది కాలవ్యవధిలో ప్రతీ ఉద్యోగి నేరుగా క్లైయింట్ లేదా ప్రాజెక్టుతో కనీసం 225 రోజులు తప్పక పనిచేయాల్సి ఉంటుంది. మిగతా సమయాన్ని ఇంటర్నల్ టాస్క్‌లు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఏఐ–క్లౌడ్ టెక్నాలజీ వంటి కొత్త సాంకేతికతల్ని అందిపుచ్చుకోవడం, ఇతర కార్యకలాపాల కోసం వెచ్చించవచ్చు. ఉద్యోగులేమంటున్నారు? కొత్త పాలసీతో తాము విపరీతమైన ఒత్తిడిలోకి వెళ్లిపోతున్నామని టీసీఎస్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'వినియోగం ఆధారంగా ఉద్యోగుల్ని హేతుబద్ధీకరించడం ఇదే తొలిసారి. ఉద్యోగాల తొలగింపునకే ఇది దారితీయగలదు' అని సోషల్ మీడియా వేదిక రెడిట్‌లో ఓ టీసీఎస్ ఉద్యోగి పేర్కొన్నారు. అలాగే 'టీసీఎస్‌లో నేను ఇటీవలే చేరాను. జావాలో శిక్షణ పొందుతున్నాను. కానీ నెల రోజులు కూడా కాకముందే అందుకు భిన్నం గా సపోర్టింగ్ ప్రాజెక్టులో చేరాలన్న ఒత్తిళ్లు వస్తున్నాయి' అని మరో ఉద్యోగి చెప్తున్నారు.

# మార్కెట్

## సౌత్ ఇండియాలో ఆషాఢం సేల్స్

**ఆర్ఎస్ బ్రదర్స్‌లో ఆఫర్లే ఆఫర్లు**

హైదరాబాద్ : కొనుగోలుదారులను ఆకట్టుకోవడంలో ఎప్పుడూ ఆర్ఎస్ బ్రదర్స్ ముందుంటుంది. ఆషాఢ మాసాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన 'సూపర్ ఆషాఢం కేజీ సేల్' క్యాప్షన్‌తో ప్రకటించిన ప్రత్యేక ఆఫర్లకు కస్టమర్ల నుంచి భారీ స్పందన లభిస్తున్నది. అన్ని రకాల వస్త్రాలపై 70 శాతం వరకు తగ్గింపు ధరతో అందిస్తున్నది. సంస్థ అందిస్తున్న పలు ఆఫర్లు రూ. 3,695 ధర కలిగిన అలంకారీ ప్రింట్ చీరను కొనుగోలు చేసిన వారికి రెండో చీరను రూ. 39కే అందిస్తున్నది. అన్ని రకాల లేడీస్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్‌పై ఆకర్షణీయమైన ధరకే విక్రయిస్తున్నది. 22 క్యారెట్ కలిగిన బంగారు ఆభరణాల కొనుగోలుపై ప్రతీగ్రాముకి రూ. 200 తగ్గింపునిస్తున్నది. పాత బంగారం ఎక్స్ఛేంజ్‌పై గ్రామునకు రూ. 100 అదనంగా పొందవచ్చును. కేజీ వెండి వస్తువులపై రూ. 5 వేల తగ్గింపునిస్తున్నది.






## వేగంగా ఆర్ఎంయూ పనులు

**2026 మార్చిలో రైల్వే బోగీల యూనిట్ ప్రారంభం**

కాజీపేట : కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలో నిర్మిస్తున్న రైల్వే మల్టీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయూ) పనులు వేగంగా జరుగుతున్నాయని, వచ్చే మార్చి నాటికి ప్రారంభించాలనుకుంటున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వెల్లడించారు. జీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆయన కాజీపేటకు వచ్చారు. ఈ పర్యటనలో భాగంగా రైల్వే సర్క్యులేటింగ్ ఏరియా, అమృత్ భారత్ పథకం పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న ఈ యూనిట్‌ను సందర్శించి సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. షెడ్డులో నిర్మాణ పనులను పరిశీలించి, వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తవుతాయని, వెంటనే ట్రయల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 160 ఎకరాల స్థలంలో రూ. 716 కోట్లతో నిర్మిస్తున్న ఈ యూనిట్‌లో తొలి ఏడాది 600 బోగీలు, ఆ తర్వాత ఏడాదిలో 2,400 బోగీలు తయారుకానున్నాయి.

## ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం-పచ్చదనం పెంచుదాం

**-ర్యాలీతో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన**

**-జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ బి విష్ణువర్ధన్**



రామగిరి, ఏప్రిల్ 22(ది క్రైమ్ న్యూస్):-అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని పురస్కరించుకొని 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపాల్ బి విష్ణువర్ధన్ ప్రారంభించారు. ర్యాలీతో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం, కాలుష్య నియంత్రణ, పర్యావరణ హిత మార్గాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ర్యాలీ జరిగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు భూమిని కాపాడుదాం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం పచ్చదనం పెంచుదామంటూ నినదించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మదర్ ఎర్త్ పక్షాన్ని జరుపుకోవాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. భూమిని సంరక్షించడం మన అందరి బాధ్యత అని, చిన్న చిన్న చర్యల ద్వారా పర్యావరణాన్ని కాపాడ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కావ్య, శ్రీలత, సదానందం, రవికాంత్, విద్యాసాగర్, మధుకర్, పింగిళి కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

**రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం**

న్యూఢిల్లీ,ఏప్రిల్ 22 : ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కాకుండా ఎన్నికల ఉల్లంఘనగా పరిగణించాలని ఆయన వాదించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తనపై నమోదైన ఈ కేసులో తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తనపై ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ఆయన వాదించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటుకు నోటు కేసు గతంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడినప్పటికీ, ఈ కేసు ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. వచ్చే విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయాలు రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, నైతిక విలువలపై ఈ కేసు కీలకంగా నిలుస్తోంది.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

**రైతులను ఆదుకోవాలంటూ చంద్రబాబుకు వివిఎస్ లేఖ**

అమరావతి,ఏప్రిల్ 22 : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులను ఆదుకోవాలని కోరుతూ ? ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. రాష్ట్రంలో మొక్కజొన్న పండించిన రైతులు దైన్యమైన స్థితిలో ఉన్నారని తెలిపారు. సుమారు 11 లక్షల ఎకరాలకు పైగా ఈ సంవత్సరం మొక్కజొన్న సాగు చేశారని, గత సంవత్సరం పొగాకు, పత్తి, మిర్చి వంటి పంటలకు సరైన ధర లేకపోవడంతో రాష్ట్రంలో రైతులు మొక్కజొన్న సాగు వైపు వెళ్లారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బర్లీ పొగాకు స్థానంలో ఇతర పంటలను ప్రోత్సహించిందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, పొగాకు, పత్తి, మిర్చి వంటి పంటలకు ధరలు పడిపోవడంతో మొక్కజొన్న సాగు సుమారు మూడు లక్షల ఎకరాలకు పైగా పెరిగిందని వివరించారు. రైతుకు ఎకరా మొక్కజొన్న సాగు చేసేందుకు సుమారు 40 వేల రూపాయలు ఖర్చు అవుతుందని, 30 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని అంచనా అని తెలిపారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, అధిక వర్షాలు, అకాల వర్షాలు, పెరిగిన సాగు ఖర్చులను తట్టుకొని రైతులు మొక్కజొన్న సాగు చేసినప్పటికీ మార్కెట్లో ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.2,400 లు మద్దతు ధర లభించడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో మార్కెట్లో దళారులు మొక్కజొన్న ధరలను క్వింటాలుకు రూ.1400 నుండి రూ.1800ల మధ్య కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. మొక్కజొన్న పండించిన రైతులు ఎకరానికి రూ.20 వేల నుండి 30వేలు నష్టపోతున్నాడు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు అనివార్యంగా మధ్య దళారులకు అమ్ముకోవాల్సి వస్తున్నదన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి నెల రోజులు అవుతున్నా కేంద్రం నుండి ఎలాంటి స్పందనా రాకపోవడంతో ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న సిఎం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా చూడాలని కోరారు. ఈలోగా కేంద్రం అనుమతి కోసం ఎదురు చూడకుండా రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

## హైకోర్టు తీర్పుతో బుద్ధి తెచ్చుకోవాలి

**కాంగ్రెస్‌కు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హితవు**

హైదరాబాద్,ఏప్రిల్22 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై హైకోర్టు తీర్పును చూసైనా కాంగ్రెస్ పార్టీ బుద్ధి తెచ్చుకోవాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జీవధార కాళేశ్వరం మీద నిందలు మోపి బీఆర్ఎస్ , కేసీఆర్ ప్రతిష్ట దెబ్బ తీసేందుకు కాంగ్రెస్, బీజేపీ వాడుకున్నాయని ఆరోపించారు. ప్రాజెక్ట్‌ను రెండున్నరేళ్లు మరమ్మతులు చేపట్టకుండా అడ్డుకున్నారు. చివరకు గత్యంతరం లేక మరమ్మతులు చేపడుతున్నారు.

# రక్తమోడుతున్న రహదారులు



నిత్యం ప్రమాదాలతో రహదారులు రక్తమోడుతున్నాయి. రోజూ దినపత్రికలను తిరగేసేవారికి రోడ్డు ప్రమాదాలు జరగని రోజంటూ ఉండదేమో అనిపించకమానదు. ఇంట్లోంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి వచ్చేంతవరకూ ప్రాణాలకు హామీ లేదంటే అతిశయోక్తి కాదు. ఏవైపునుంచి ఏ వాహనం మీదకు దూసుకువస్తుందో, ఏ మూలమలుపులో మృత్యుదేవత మాటువేసుకుని కూర్చుందో తెలియదు. తాజాగా జమ్మూకశ్మీర్ లోని ఉధంపూర్ సమీపాన ఓ బస్సు లోయలో పడి, 21 మంది కన్నుమూసిన ఘటన దిగ్భ్రాంతికరం. కొండప్రాంతంలో బస్సు ప్రయాణిస్తుండగా మూలమలుపు వద్ద దారి కనబడకపోవడంతోనే బస్సు లోయలో పడిపోయినట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. కారణాలు ఏవైనా, ప్రమాదం జరిగాక మృతుల బంధువులకు మిగిలేది తీరని శోకమే. ప్రమాదం మిగిల్చిన అవకరాలతో క్షతగాత్రులు జీవితాంతం దీనంగా బతుకు ఈడ్వవలసిందే. ప్రభుత్వాలు అప్పటికప్పుడు లక్షల్లో నష్టపరిహారాలను ప్రకటించవచ్చుగాక, అవేవీ కోల్పోయిన తమ బంధువులను తిరిగి తీసుకురావడానికి ఎంతమాత్రం సహాయపడవు కదా. వాహనాలను నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై చోదకుల నిర్లక్ష్యం, పరిమితికి మించి అతివేగంగా నడపడం వంటివి ప్రమాదాలకు ప్రధాన హేతువులు కాగా, వాహనాలలోని సాంకేతిక లోపాలు సైతం పదుల సంఖ్యలో ప్రాణాలను కబళిస్తున్న సంఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి. స్లీపర్ బస్సులలో ఉన్నపళంగా మంటలు చెలరేగి, అందులో ఉన్న ప్రయాణికులు సజీవంగా ఆహుతి అవుతున్న సంఘటనలు దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్నాయి. మొన్నటికి మొన్న హైదరాబాద్ నుంచి రాత్రివేళ బయల్దేరిన ఓ ప్రవేటు బస్సు, బయల్దేరి నాలుగు కిలోమీటర్లు దాటిందో లేదో మంటల్లో చిక్కుకోవడం ఈ తరహా ప్రమాదాలు ఎక్కువవుతున్నాయనడానికి నిదర్శనం. ఇలాంటి ప్రమాదాలకు గల కారణాలపై నిపుణులతో అధ్యయనం జరిపించాలన్న ఆలోచన, ఒకవేళ అధ్యయనాలు జరిగినా వాటి ఆధారంగా చర్యలు తీసుకోవాలన్న చిత్తశుద్ధి పాలకుల్లో లోపిస్తున్నాయి. ప్రపంచంలోని వాహనాలలో భారతదేశంలో ఉన్నవి కేవలం ఒక్క శాతమే అయినా రోడ్డు ప్రమాదాల సంఖ్యలో మాత్రం మన దేశం అగ్రస్థానంలో ఉండటం శోచనీయం. ఏటా భారతదేశంలో 4.8 లక్షల ప్రమాదాలు జరుగుతుంటే, అందులో లక్షా డబ్బైవేలమంది వరకూ ప్రాణాలు కోల్పోతున్నారట. దేశంలో సగటున రోజూ 474 మంది రోడ్డు ప్రమాదాలకు బలవుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా తర్వాత ప్రపంచంలోనే అతి పెద్ద రహదారి నెట్ వర్క్ ఉన్నది భారతదేశంలోనే. కానీ, ఇక్కడ జాతీయ, ప్రధాన రహదారులలో అనేక లోపాలు ఉన్నాయని, బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన చోట్ల కూడా మరమ్మతులు అనుకున్నంత వేగంగా సాగడం లేదని కేంద్ర రోడ్డు రవాణా మంత్రే స్వయంగా పార్లమెంటులో ఆ మధ్య వాపోవడం మన రహదారుల దుస్థితికి అద్దం పడుతోంది. రోడ్డు ప్రమాదాలపై సందర్భం వచ్చినపుడల్లా సర్వోన్నత న్యాయస్థానం చీవాట్లు పెడుతూనే ఉన్నా, అవేవీ పాలకుల చెవికి ఎక్కడం లేదు. రాజస్థాన్ లోని ఫలోడి, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాల్లో గత ఏడాది నవంబర్ 2, 3 తేదీల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు ఈ ప్రమాదాలకు కారణాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన అనంతరం దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన మార్గదర్శకాలను రెండు రోజుల క్రితమే ప్రకటించింది. సురక్షితమైన రహదారి ప్రయాణం రాజ్యాంగంలోని జీవించే హక్కు (ఆర్టికల్ 21) లో అంతర్భాగమని, ప్రమాద రహిత ప్రయాణం ప్రతి పౌరుడి హక్కు అని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు పాలనాపరమైన నిర్లక్ష్యం, మౌలిక సదుపాయాల కల్పనలో లోపాలే ప్రాణనష్టానికి కారణమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సందర్భంలో రహదారి భద్రతను రాజ్యాంగబద్ధమైన బాధ్యతగా పేర్కొంటూ మార్గదర్శకాలు జారీ చేసింది. మరిన్ని కనుగొనండి వార్తల ఆర్కైవ్ ఆధ్యాత్మిక పుస్తకాలు పిల్లల విద్యా ఉత్పత్తులు ాశ్రీంశీ =ముఃు - వామపక్షాలన్నీ కలిస్తేనే గెలుపు ాఁఞజవతీఅంవఎవత్ నిర్దేశిత ప్రాంతాల్లో మినహా భారీ వాహనాలను జాతీయ రహదారులపై ఎక్కడబడితే అక్కడ నిలపకూడదని, రియల్ టైమ్ అలెర్టులు, జిపిఎస్ ఆధారిత ఫోటోగ్రాఫిక్ సాక్ష్యాలు, ఇ-చలాన్ల ద్వారా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రతి జిల్లాలో జాతీయ రహదారులు ఉన్న చోట జిల్లాస్థాయిలో రహదారి భద్రత టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి వాటిపై దృష్టిపెట్టాలని హితవు చెప్పింది. సుప్రీంకోర్టు ఆదేశాలను శిరోధార్యంగా భావించి, అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలదే. ప్రమాదం జరిగినప్పుడల్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, నష్ట పరిహారం ప్రకటించి చేతులు దులుపుకోగానే సరిపోదని గుర్తించాలి.

## ఉద్యోగిగా ఉంటూ వైసిపికి ప్రచారం

**2024లోనే వెంకట్రామిరెడ్డి సస్పెన్షన్**

**మాజీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్ బాబు**

అమరావతి,ఏప్రిల్ 22 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిపై చర్యలు ప్రారంభమయ్యాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు తెలిపారు. '2024లో ఆయనను సస్పెండ్ చేసింది మీ ప్రభుత్వమే' అని వైసిపికి గుర్తుచేశారు. 2024 ఎన్నికల సమయంలో వెంకట్రామిరెడ్డి వైసీపీ జెండాలు పట్టుకుని ప్రచారం చేసినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. బద్వేల్ రిటర్నింగ్ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగానే అప్పట్లో వెంకట్రామిరెడ్డిపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి రాజకీయ ప్రచారంలో పాల్గొనడం 'కండక్ట్ రూల్స్'కు విరుద్ధమని.. అందుకే డిస్మిస్ చేశారని అశోక్ బాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగస్టులో జరిగిన విచారణలో వెంకట్రామిరెడ్డి నేరం చేసినట్లు రుజువైందన్నారు. వెంకట్రామిరెడ్డి అరాచకాలు, నిబంధనల ఉల్లంఘనలన్నీ జీఓ 464లో స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా చంద్రబాబు తప్పు చేస్తున్నారంటూ జగన్ మాట్లాడటం హాస్యాస్పదమని మండిపడ్డారు. ఉద్యోగులకు రూ.30 వేల కోట్లు బాకీ పెట్టి, జీతాలు సకాలంలో ఇవ్వని వ్యక్తి జగన్ అంటూ విమర్శించారు. ఉద్యోగుల గురించి మాట్లాడే అర్హత, హక్కు జగన్‌కు లేదని అశోక్ బాబు వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు తప్పు చేశారంటూ జగన్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఏబీ వెంకటేశ్వరరావు, ఎల్వీ సుబ్రహ్మణ్యం వంటి అధికారులను వేధించింది మరిచిపోయారా అని నిలదీశారు. ఉద్యోగులను బెదిరించి దేశంలో ఎక్కడా లేని విధంగా రివర్స్ పీఆర్సీ ఇచ్చిన ఘనత జగన్‌దే అంటూ దుయ్యబట్టారు. కూటమి పాలనలో ఇప్పటికే ఉద్యోగులకు రూ.22,000 కోట్ల మేర బకాయిలు చెల్లించామని చెప్పారు. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీలో అక్రమాలకు పాల్పడి పబ్లిక్ స్థలాలను కూడా అమ్మేసుకున్న వ్యక్తి వెంకట్రామిరెడ్డి అని ఆరోపించారు. వెంకట్రామిరెడ్డి కుటుంబం మొత్తం వైసీపీ కార్యకర్తలే అని.. ఆయన భార్య ముషీరాబాద్ టికెట్ అడిగిన విషయం నిజం కాదా అని అశోక్ బాబు ప్రశ్నించారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు చనిపోతే పట్టించుకోని జగన్.. ఉద్యోగుల పాలిట 'నరకాసురుడు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నిబంధనల ప్రకారం, ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే అని అశోక్ బాబు స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు జగన్ ప్రభుత్వం హయాంలోనే వెంకట్రామిరెడ్డి సస్పెండ్ అయ్యారని ఏపీ టీడీపీ ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు అన్నారు. జగన్ నిజం ఒప్పుకుంటున్నాడని, ఎందుకంటే ఆయన చేసిన తప్పులకు జైల్లో పెట్టకుండా చంద్రబాబు తప్పు చేశారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఆ తప్పు చేయడంవల్లే జగన్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని అశోక్ బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. 2024 ఏప్రిల్ 2న ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కాండక్ట్ రూల్స్‌ను బ్రేక్ చేసి కాకర్ల వెంకట్రామిరెడ్డి, చల్లా చంద్రయ్యలు వైసీపీ జెండాలు పట్టుకొని కడప జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోల్లో వైసీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారని ఆరోపించారు. అవినీతి, పనిపట్ల నిబద్ధత లేకపోవడం, పనిచేయకపోవడం వంటి వాటికి కాండక్ట్ రూల్స్ ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు.

## త్రిస్సూర్ బాణాసంచా పేలుడు ఘటన

**రాష్ట్రవిపత్తుగా ప్రకంటించిన ప్రభుత్వం**

తిరువనంతపురం,ఏప్రిల్ 22 : కేరళలోని త్రిస్సూర్ లో బాణా సంచా పేలుడు ఘటనను విజయన్ ప్రభుత్వం బుధవారం రాష్ట్ర విపత్తుగా ప్రకటించింది. ఈ ఘటనను రాష్ట్ర విపత్తుగా కేరళ మంత్రివర్గం బుధవారం విపత్తు నిర్వహణ అథారిటీని ఆదేశించింది. ఈ ప్రమాదంపై న్యాయవిచారణకు ఆదేశించింది. జస్టిస్ సి.ఎన్. రామచంద్రన్ నాయర్ నేతృత్వంలో న్యాయ కమిషన్ పర్యవేక్షించనుంది. మృతుల కుటుంబాలకు రూ.14 లక్షల అత్యవసర ఆర్థిక సహాయం అందించనున్నట్లు విజయన్ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నుండి రూ.4 లక్షలు, సిఎం విపత్తు సహాయ నిధి (సిఎండిఆర్ ఎఫ్)నుండి రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపింది. గాయపడిన వారికి ఎస్ డిఎంఎ నిధి కింద కేటాయించిన మొత్తాన్ని ఇవ్వనున్నారు. అదనంగా సిఎండి ఆర్ ఎఫ్ నుండి రూ.2లక్షలు అత్యవసర ఆర్థిక సహాయం కింద అందించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో గాయపడిన వారి చికిత్స ఖర్చులను ఆరు నెలల పాటు ప్రభుత్వం భరించనున్నట్లు తెలిపింది. ఈ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ సిఫార్సు ఆధారంగా సిఎండిఆర్ఎఫ్ నుండి కేటాయిస్తారు. అదనంగా, విపత్తు ప్రతిస్పందన నిధి నుండి అనుమతించబడిన మొత్తాన్ని వైద్య సహాయంగా అందిస్తారు. ఒకవేళ ఆరు నెలల కంటే ఎక్కువ కాలం చికిత్స అవసరమైతే, సిఫార్సు చేయబడిన ప్రైవేట్ ఆసుపత్రులలోని చికిత్స ఖర్చులను వైద్య మండలి నిర్ణయం ఆధారంగా సీఎండీఆర్ఎఫ్ నుండి కేటాయించనున్నట్లు వెల్లడించింది. ప్రమాదం అనంతరం గాలింపు, సహాయక చర్యలను సులభతరం చేసేందుకు ఆ ప్రాంతంలోని ప్రైవేట్ గోడలను కూల్చివేయడంతో పాటు వరి పొలాలను చదును చేసి పూడ్చివేయాల్సి వచ్చింది. గోడల పునరుద్ధరణ కోసం అయ్యే ఖర్చును, రైతులకు పరిహారాన్ని జిల్లా కలెక్టర్ సిఫార్సు ఆధారంగా విపత్తు ప్రతిస్పందన నిధి నుండి కేటాయించనున్నారు. మృతదేహాలను ఖననం చేయడానికి మరియు డిఎన్ ఎ పరీక్షల కోసం నమూనాలను సేకరించేందుకు ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని జారీ చేయాలని ఎస్ డి ఎం ఎ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీకి సూచించింది. పేలుడు కారణంగా సమీపంలోని నివాసాలకు జరిగిన నష్టంపై తక్షణమే నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించింది. ఎస్ డి ఆర్ ఎఫ్ నుండి పరిహారం అందించాలని సూచించింది.

## మాజీ సిఎం నాదెండ్ల భాస్కర రావు మృతి

**మంత్రి కందుల దుర్గేశ్ తదితరుల సంతాపం**

హైదరాబాద్,ఏప్రిల్22 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం జనసేన పార్టీ తరపున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా నాదెండ్ల భాస్కరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీయం. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వల్పకాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయనకు పరిపాలనపై గట్టి పట్టు ఉండేది. చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉంది.

## నాదెండ్ల మృతికి సిఎం, డిప్యూటి సిఎం సంతాపం

**మనోహర్‌కు ఫోన్ చేసి పరామర్శించిన బాబు**

అమరావతి,ఏప్రిల్ 22 : మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సంతాపం తెలిపారు. నాదెండ్ల ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భవవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు. భాస్కరరావు తనయుడు, మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఫోన్ చేసి పరామర్శించారు.. భాస్కరరావు కుటుంబసభ్యులకు సీఎం, మంత్రి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నాదెండ్ల భాస్కర రావు మృతిపై సంతాపం తెలిపారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు తుది శ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నా. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను' అని డిప్యూటీ సీఎం పవన్ ఆవేదన చెందారు. నాదెండ్ల భాస్కరరావు 70వ దశకం నుంచి ప్రజా జీవితంలో ఉన్నారన్నారు. న్యాయవాదిగా, రాజకీయవేత్తగా ఆయనకున్న పరిజ్ఞానం ఎంతో విలువైనదని చెప్పుకొచ్చారు. విజయవాడ ఈస్ట్, వేమూరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా, ఖమ్మం నుంచి ఎంపీగా గెలిచి సేవలందించారని గుర్తుచేశారు. 'నాదెండ్ల భాస్కర రావు కుమారుడు, నా సహచర మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్.. పితృ వియోగం బాధ నుంచి త్వరగా కోలుకోవాలి' అని కాంక్షించారు. మనోహర్‌కు, ఇతర కుటుంబ సభ్యులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అనిల్ జైన్‌పై చర్య తీసుకోండి

**జలశక్తి మంత్రికి బండి లేఖ**

హైదరాబాద్,ఏప్రిల్ 22 : కేంద్ర జల్‌శక్తి మంత్రికి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమంలో ఆయన పాల్గొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈనెల 20వ తేదీన రాజకీయ ప్రయోజనాల కోసం రేవంత్‌రెడ్డి మేడిగడ్డను సందర్శించారని చెప్పుకొచ్చారు. ఆ కార్యక్రమంలో అనిల్ జైన్ ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. భవిష్యత్తులో బ్యారేజీలకు మరింత నష్టం జరిగితే.. ఎన్డీఎస్ఏపై కాంగ్రెస్ ప్రభుత్వం నిందమోపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కమిటీ సిఫార్సులను నీరుగార్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కేంద్రానికి చెడ్డపేరు తెచ్చేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహించారు. అనిల్ జైన్‌పై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ కుమార్ సూచించారు.

## రెండు రాష్ట్రాల్లో భారీగా నగదు, మద్యం, నగలు పట్టివేత

**దాదాపు వేయికోట్ల విలు వుంటుందని ఇసి వెల్లడి**

న్యూఢిల్లీ,ఏప్రిల్ 22 : ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ధనం, మద్యం, ఉచితాలతో ఓటర్లను ప్రలోభపెడుతుండటం సర్వసాధారణంగా మారింది. ఇలాంటి ప్రలోభాలపై ఈసీ డేగకన్ను వేస్తుంటుంది. తాజాగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన రూ.1,000 కోట్లకు పైగా విలువచేసే నగదు, మద్యం, డ్రగ్స్, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పశ్చిమబెంగాల్‌లో రూ.472.89 కోట్లు, తమిళనాడులో రూ.599 కోట్లు విలువచేసే నగదు, మద్యం, ఆభరణాలు, డ్రగ్స్, ఉచితాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ వెల్లడించింది. ఇందులో రూ.127.67 కోట్ల నగదు, రూ.106.3 కోట్ల విలువైన మద్యం, రూ.184.83 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, రూ.215.19 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.437.97 కోట్ల విలువైన ఇతర ఉచితాలు ఉన్నట్టు ఈసీ తెలిపింది.




# సిటాడెల్-2 సీజన్‌లో ప్రియాంక చోప్రా

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, హాలీవుడ్ నటుడు రిచర్డ్ మాడెన్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ సిరీస్ 'సిటాడెల్' రెండో సీజన్‌కు సంబంధించి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ అధికారిక ట్రైలర్‌ను విడుదల చేస్తూ.. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్ట్రీమింగ్ తేదీని ప్రకటించింది. ఈ సిరీస్‌ను మే 6 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషల్లో ఈ సిరీస్ అందుబాటులోకి రాబోతోంది. ఈ రెండో సీజన్ ట్రైలర్ గమనిస్తే.. ఫస్ట్ పార్ట్ కంటే ఇందులో మరింత యాక్షన్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. నాడియా సిన్ (ప్రియాంక), మేసన్ కేన్ (రిచర్డ్) మరియు బెర్నార్డ్ ఓర్లిక్ (స్టాన్లీ టుచి) తమ గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూనే, సిటాడెల్ సంస్థను నాశనం చేసిన క్రూరమైన 'మాంటికోర్' నెట్‌వర్క్ నుంచి ప్రపంచాన్ని రక్షించే భారీ మిషన్‌లో తలపడబోతున్నారు. హాలీవుడ్ ప్రముఖులు జాక్ రేనర్, మ్యాట్ బెర్రీ వంటి వారు కొత్తగా ఈ సీజన్‌లో భాగం కాగా, రూసో బ్రదర్స్ నిర్మాణ విలువలు ఈ సిరీస్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ప్రస్తుతం రాజమౌళి ? మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి' సినిమా షూటింగ్‌లో ప్రియాంక చోప్రా బిజీగా ఉన్నప్పటికీ, ఆమె తన గ్లోబల్ ప్రాజెక్ట్ 'సిటాడెల్'తో అంతర్జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటడానికి సిద్ధమైంది.



# చిరుతో బాబీ సినిమా

## నెగెటివ్ రోల్‌లో డింపుల్ హయతి

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 'వాల్తేరు వీరయ్య'తో మ్యాజిక్ చేసిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి మళ్ళీ చేతులు కలిపారు. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులను ముగించుకుని షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఇక ఈ సినిమాలో చిరు సరసన ప్రియమణి హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి తాజాగా వినిపిస్తున్న ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు సమాచారం. సాధారణంగా డింపుల్ హయాతి అంటే గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్. కానీ బాబీ ఈ సినిమాలో ఆమెను సరికొత్తగా చూపించబోతున్నారట. ఇందులో ఆమె హీరోయిన్ కాదు అని, నెగిటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుందని తెలుస్తోంది. మెగాస్టార్ వంటి దిగ్గజ నటుడికి ఎదురు నిలిచే పాత్ర కావడంతో డింపుల్ రోల్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోందట. ఈ డిఫరెంట్ కాస్టింగ్ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని ఫిలిం నగర్ వర్గాలు భావిస్తున్నాయి. కమెగాస్టార్ ఒక సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారని, బాబీ ఈ పాత్రను చాలా స్టైలిష్‌గా డిజైన్ చేశారని టాక్.







## పెద్ది మూవీలో శృతి స్పెషల్ డ్యాన్స్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'కి సంబంధించిన తాజా అప్‌డేట్ టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ కోసం ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించినా? చివరకు ఈ అవకాశాన్ని శృతి హాసన్ దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ త్వరలోనే ప్రారంభమై, తక్కువ సమయంలో పూర్తయ్యేలా చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాకు హైలైట్‌గా నిలిచే ఈ పాటలో శృతి హాసన్ గ్లామర్, స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక శృతి హాసన్‌కు స్పెషల్ సాంగ్స్ కొత్తేమీ కాదు. గతంలోనే రామ్ చరణ్‌తో కలిసి 'ఎవడు' సినిమాలో 'పింపుల్ డింపుల్' పాటలో సందడి చేసిన విషయం తెలిసిందే. అలాగే మహేశ్ బాబు నటించిన 'ఆగడు' సినిమాలో కూడా ఆమె ప్రత్యేక గీతంలో మెరిసి ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు 'పెద్ది'లో మరోసారి స్పెషల్ సాంగ్‌తో రాబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటికే ఈ సినిమా పై భారీ అంచనాలు ఉండగా? శృతి హాసన్ ఎంట్రీతో మరింత హైప్ పెరిగే అవకాశముంది.ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న 'పెద్ది' సినిమా నుంచి త్వరలోనే ఈ స్పెషల్ సాంగ్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఈ పాట ఎలా ఉండబోతుందో? శృతి హాసన్ ఏ రేంజ్‌లో ఆకట్టుకుంటుందో చూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ఉప్పెన' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం పెద్ది కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె తెలుగులో చేస్తున్న కీలక ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలుస్తోంది.



## కొత్త గృహంలోకి ప్రవేశించనున్న బన్నీ

### జూబ్లీహిల్స్‌లో ఖరీదైన ఇంటి నిర్మాణం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో తన క్రేజ్‌ను రోజు రోజుకు పెంచుకుంటూ, సంపాదనలోనూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. 'పుష్ప' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, సినిమాల ద్వారా మాత్రమే కాకుండా బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, భారీ రెమ్యునరేషన్లతో టాలీవుడ్‌లో అత్యధిక ఆదాయం పొందుతున్న నటులలో ఒకరిగా నిలిచారు. ఈ విజయాలకి తగ్గట్టుగానే ఆయన జీవనశైలిని కూడా విలాసవంతంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఇప్పటికే సినీ రంగంలోనే కాకుండా వ్యాపార రంగంలో కూడా అడుగుపెట్టిన బన్నీ, 'అల్లు స్టూడియోస్' నిర్మాణంతో తన విజన్‌ను చూపించారు. ఇప్పుడు అదే స్థాయిలో తన వ్యక్తిగత జీవితంలో కూడా ఓ భారీ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో ఆయన నిర్మిస్తున్న కొత్త మేన్షన్ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లగ్జరీ హౌస్ సుమారు 4 వేల చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మితమవుతోంది. అత్యాధునిక సదుపాయాలు, ప్రీమియం ఇంటీరియర్స్, ప్రత్యేక డిజైన్‌లతో ఈ ఇంటిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.



# సల్మాన్, వంశీపైడిపల్ల మూవీకి క్లాప్

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ ఎస్‌వి63 ముంబైలో ఘనంగా ప్రారంభమైంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇది సల్మాన్ ఖాన్ కెరీర్‌లోనే ఒక ప్రత్యేకమైన యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా ఉండబోతోందని సమాచారం. ఇక మొదటిసారి సల్మాన్ ఖాన్‌ను వంశీ పైడిపల్లి డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com